ఏపీ చేపడుతున్న 90 టీఎంసీల నీటి తరలింపును అడ్డుకునేందుకు తెలంగాణ ప్రభుత్వం ఏం చర్యలు తీసుకుంది? ఏపీ నీటి తరలింపును అడ్డుకోవాలని కేఆర్ఎంబీని తెలంగాణ ప్రభుత్వం కోరిందా? సమాధానం చెప్పాలి. హైదరాబాద్, నల్గొండ, మహబూబ్‌నగర్, ఖమ్మం జిల్లాల తాగునీటి అవసరాలకు కృష్ణా జలాల్లో ఎంత నీటిని కేటాయించారు? తాగునీటి అవసరాల కోసం శ్రీశైలం, నాగార్జున సాగర్‌లో తెలంగాణ ప్రభుత్వం ఎంత నీటిని నిల్వ ఉంచుతుంది? బోర్లు వేస్తున్నా నీళ్లు పడటం లేదు.. తెలంగాణలో తాగునీటి సంక్షోభంపై ప్రభుత్వం సమాధానం చెప్పాలి. అక్టోబర్‌కు ముందే ఏపీ నీటి తరలింపుపై తెలంగాణ ప్రభుత్వం మేల్కొందా? కేఆర్ఎంబీ వద్ద ఏమైనా నిరసన తెలిపిందా? కేఆర్ఎంబీలో తెలంగాణకు ప్రాతినిధ్యం లేకుండా పోయింది.. తెలంగాణ హక్కుల గురించి మాట్లాడేవారే లేరు. కేఆర్ఎంబీలో తెలంగాణ ప్రాతినిధ్యం ఏమైంది? తెలంగాణ హక్కులను కాపాడేందుకు ప్రభుత్వం ఏం చేస్తోంది? ఏపీ నీటి తరలింపుపై కేఆర్ఎంబీకి బీఆర్ఎస్ పార్టీ తరఫున లేఖ రాస్తాం. తెలంగాణ నీటి హక్కుల కోసం కేంద్ర ప్రభుత్వంపై కూడా ఒత్తిడి తెస్తాం. తెలంగాణ నుంచి 8 మంది బీజేపీ ఎంపీలు ఉన్నారు.. రాష్ట్ర నీటి హక్కులపై ఎందుకు స్పందించడం లేదు? తెలంగాణ నీటి దోపిడీ జరుగుతుంటే బీజేపీ ఎంపీలు, కేంద్ర మంత్రులు ఎందుకు మౌనంగా ఉన్నారు? తెలంగాణ నీటి హక్కుల కోసం కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి కేఆర్ఎంబీకి ఆదేశాలు ఇప్పించాలి. సాగునీటి కోసం రైతులు అల్లాడుతుంటే.. తాగునీటి కోసం ప్రజలు తల్లడిల్లుతుంటే నీటి దోపిడీని చూస్తూ ఊరుకోం. రేవంత్ రెడ్డికి మొహమాటాలు ఉండొచ్చు.. తెలంగాణ నీటి హక్కుల విషయంలో బీఆర్ఎస్‌కు మొహమాటాలు లేవు. తెలంగాణ జల దోపిడీని అడ్డుకునే వరకు బీఆర్ఎస్ పోరాటం ఆపదు. అవసరమైతే ఏపీ నీటి తరలింపుపై న్యాయపోరాటం చేస్తాం.. ప్రజాక్షేత్రంలో ఉద్యమిస్తాం. నల్గొండలో బహిరంగ సభ నిర్వహించి రైతులు, ప్రజలను జాగృతం చేస్తాం. మహబూబ్‌నగర్‌లోనూ ప్రజలను చైతన్యపరిచి నీటి హక్కుల కోసం పోరాటం చేస్తాం. సాగర్‌ను ఇష్టానుసారంగా దోచుకుంటామంటే బీఆర్ఎస్ చూస్తూ ఊరుకోదు. తెలంగాణ నీటి హక్కులపై కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తే ప్రజా ఉద్యమం తప్పదు. నల్గొండ, ఖమ్మం, మహబూబ్‌నగర్ జిల్లాల ప్రజల నుంచి ఏపీ నీటి దోపిడీకి తీవ్ర ప్రతిఘటన ఎదురవుతుంది. కేఆర్ఎంబీ వెంటనే స్పందించి ఏపీ చేపడుతున్న అక్రమ నీటి తరలింపు ప్రాజెక్టును నిలిపివేయాలి. కృష్ణా నదీ పరివాహక ప్రాంతంలో జరుగుతున్న నీటి దోపిడీని ప్రజల దృష్టికి తీసుకెళ్తాం. తెలంగాణ ప్రభుత్వం ప్రేక్షక పాత్ర పోషిస్తుంటే.. ఏపీ ప్రభుత్వం తాబేదారులను అడ్డం పెట్టుకొని వనరులను కొల్లగొడుతోంది. తెలంగాణ నీటి హక్కుల అంశాన్ని ప్రజలతో పాటు న్యాయస్థానాలు, ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్తాం. తెలంగాణ నీటి హక్కుల కోసం బీఆర్ఎస్ పోరాటం.. అవసరమైతే ప్రజా ఉద్యమానికి శ్రీకారం చుడతాం అని కేటీఆర్ హెచ్చరించారు.

మూసీ ప్రాజెక్టుపై ప్రభుత్వానికి నోటీసులు

ఎన్‌జీటీలో విచారణ..
డిసెంబర్ 3కు వాయిదా

విశాలభారతి, స్టేట్ బ్యూరో:

మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టు పర్యావరణ నుమతులపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. సర్కార్ మాత్రం మూసీ ప్రాజెక్టుకు అనుమతులు వచ్చాయంటూ బుకాయిస్తుండటంపై సామాజిక కార్యకర్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పిటిషనర్ బాబురావు దాఖలు చేసిన అప్పీల్ నం. 50/2026 ఈ నెల 3న విచారణ జరగగా, ప్రభుత్వానికి నోటీసులు జారీచేసి, కేసును డిసెంబర్ 3కు వాయిదా వేసింది. మూసీ నది పునరుజ్జీవం, సుందరీకరణ లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ఈ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టును చేపట్టింది. దీనికి ఇచ్చిన పర్యావరణ అనుమతులతో జీవావరణాన్ని దెబ్బతీసే ఈ ప్రాజెక్టుపై పర్యావరణవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో పర్యావరణవేత్త బాబురావు పిటిషన్ దాఖలు చేయగా, ప్రతివాదిగా ఉన్న ప్రభుత్వానికి నోటీసులు జారీ చేయాలని ట్రిబ్యునల్ ఆదేశించింది. ప్రాజెక్టుకు ఇచ్చిన పర్యావరణ అనుమతిని సవాలు చేస్తూ అనుమతి మంజూరు ప్రక్రియను ట్రిబ్యునల్ ముందు ప్రశ్నిస్తున్నారు. ఈ ఉత్తర్వు వెలువడి రెండు వారాలకుపైగా అయిన నేపథ్యంలో, కొన్ని మీడియా సంస్థలు స్టే ఇవ్వడానికి ట్రిబ్యునల్ నిరాకరించిందంటూ కథనాలు ప్రచురించాయి. అయితే అధికారిక ఉత్తర్వులో స్టే అంశం ప్రస్తావనే లేదని బాబురావు స్పష్టం చేశారు. ఆ ఉత్తర్వులో కేవలం నోటీసులు, కౌంటర్ల దాఖలు, వాయిదాకు సంబంధించిన ప్రక్రియపై ఉత్తర్వులు మాత్రమేనని, ప్రాజెక్టుకు అనుకూలంగా గాని, వ్యతిరేకంగా గాని ఎలాంటి వ్యాఖ్యలు లేవన్నారు. ఉత్తర్వు ఎన్‌జీటీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉందన్నారు. కేసు తదుపరి విచారణ డిసెంబర్ 3న జరగనున్నది. ఆ రోజు ప్రతివాదుల జవాబులను పరిశీలించిన అనంతరం ట్రిబ్యునల్ తదుపరి చర్యలు చేపట్టే అవకాశం ఉందని స్పష్టం చేశారు.



గుడిసెలో నివసించే వారికి ఇందిరమ్మ ఇండ్ల ప్రొసీడింగ్ ఆర్డర్లు అందజేత

- చైర్ పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్



చౌటుప్పల్,విశాల భారతి: మున్సిపల్ కార్యాలయంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ ప్రొసీడింగ్ ఆర్డర్లను చైర్ పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్ చేతుల మీదుగా 46 మంది లబ్ధిదారులకు పంపిణీ చేయడం జరిగింది. వీరిలో 4 మంది గుడిసెలలో నివసించే లబ్ధిదారులు ఉన్నారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ మాట్లాడుతూ.. పట్టణంలోని అన్ని వార్డుల్లో నివసించే నిరుపేద కుటుంబాలకు,శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సహకారంతో అర్హులైన ప్రతి ఒక్క కుటుంబానికి పక్కా ఇల్లు కట్టుకునే అదృష్టం కలిగిందని అన్నారు. పట్టణంలో పేదలందరికీ నిష్పక్షపాతంగా, పారదర్శకంగా, రాజకీయాలకు అతీతంగా ప్రభుత్వపరంగా అందే ప్రతి ఒక్క సంక్షేమ పథకాన్ని ప్రజలకు అందజేయడమే తన లక్ష్యమని తెలిపారు. ప్రతి కౌన్సిలర్, కోఆప్షన్ సభ్యుల సహకారంతో పేద ప్రజల కష్టాలను తీర్చడంతో పాటు, పట్టణాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎన్. వెంకటేశ్వర నాయక్, వైస్ చైర్మన్ గోశిక వినయ్ కుమార్, కౌన్సిలర్లు పూదరి యాదయ్య, కొయ్యడ శేఖర్, పాక చిరంజీవి, బద్రి గాలయ్య, చింతల ఉమామహేశ్వరి సాయిలు, పిల్లలమర్రి మధుసూదన్, హన్ను మహమ్మద్, నాయకులు సురేందర్ రెడ్డి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు కాసర్ల శ్రీనివాస్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ కొయ్యడ సైదులు, దేప రాజు, బత్తుల విప్లవ కుమార్, ఉడుగు రమేష్, గడ్డం రాజరత్నం మరియు మున్సిపల్ మేనేజర్ శ్రీధర్ రెడ్డి, ఆర్వో అంజయ్య, సీనియర్ అసిస్టెంట్ దీప, సానిటరీ ఇన్స్పెక్టర్ హనుమాన్ ప్రసాద్, హౌసింగ్ ఏఈ కళ్యాణి, వార్డ్ ఆఫీసర్లు, బిల్ కలెక్టర్లు మరియు లబ్ధిదారులు పెద్ద ఎత్తున పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

పరిశ్రమలు ఎవరి కోసం? స్థానిక యువతకు ఉద్యోగాలు ఎందుకు ఇవ్వడం లేదు?

- ఉమ్మడి ఖమ్మం,వరంగల్,నల్గొండ జిల్లాలకు ప్రత్యేక పారిశ్రామిక అభివృద్ధి ప్రణాళిక ప్రకటించాలి
- డాక్టర్ చిలకల శ్రీనివాస్ యాదవ్ డిమాండ్

చౌటుప్పల్, విశాలభారతి:



తెలంగాణ రాష్ట్రంలోని ఉమ్మడి ఖమ్మం, వరంగల్, నల్గొండ జిల్లాల్లో పారిశ్రామిక అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని, పరిశ్రమల ద్వారా స్థానిక ప్రజలకు ఎంత ప్రయోజనం కలుగుతోందో ప్రజలకు సమాధానం చెప్పాలని బీసీవై పార్టీ తెలంగాణ రాష్ట్ర పిఏసి సభ్యులు, హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు, వరంగల్ఖమ్మంనల్గొండ ఉమ్మడి పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ చిలకల శ్రీనివాస్ యాదవ్ డిమాండ్ చేశారు. పరిశ్రమల స్థాపనకు ప్రభుత్వం భూములు, విద్యుత్, నీరు, రహదారులు వంటి సదుపాయాలు కల్పిస్తూ పెట్టుబడిదారులను ప్రోత్సహిస్తోందని, మరి అదే ప్రాంతంలో చదువుకున్న స్థానిక నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు కల్పించడంలో ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారని ప్రశ్నించారు. ప్రతి సంవత్సరం వేలాది మంది యువత డిగ్రీ, పీజీ, ఐటీఐ, పాలిటెక్నిక్, ఇంజనీరింగ్, ఇతర వృత్తి విద్యా కోర్సులు పూర్తి చేస్తున్నప్పటికీ ఉద్యోగాలు లభించక ఇతర ప్రాంతాలకు వలస వెళ్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

మూడు ఉమ్మడి జిల్లాలకు ప్రత్యేక పారిశ్రామిక విజన్ అవసరం!

ఉమ్మడి ఖమ్మం: వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు, ఫుడ్ ప్రాసెసింగ్, పత్తి, అటవీ ఉత్పత్తులు, కోల్డ్ స్టోరేజ్ పరిశ్రమలను ప్రోత్సహించాలి.

ఉమ్మడి వరంగల్: టెక్స్‌టైల్, గార్మెంట్స్, ఐటీ, తయారీ రంగాలను అభివృద్ధి చేసి కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్ ద్వారా స్థానిక యువతకు మరిన్ని ఉద్యోగాలు కల్పించాలి.

ఉమ్మడి నల్గొండ: సిమెంట్, నిర్మాణ రంగం, వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు, డెయిరీ, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను విస్తరించాలి.

ప్రభుత్వానికి ఐదు సూటి ప్రశ్నలు:

- మూడు ఉమ్మడి జిల్లాల్లో ప్రస్తుతం ఎన్ని పరిశ్రమలు ఉన్నాయి?
- వాటిలో ఎంతమంది స్థానిక యువతకు ఉద్యోగాలు కల్పించారు?
- పరిశ్రమల పెట్టుబడులు, ఉద్యోగుల వివరాలను ప్రజలకు ఎందుకు వెల్లడించడం లేదు?
- మూతపడిన పరిశ్రమలను తిరిగి ప్రారంభించడానికి ఎలాంటి చర్యలు తీసుకున్నారు?
- కొత్త పరిశ్రమల స్థాపనకు ఐదేళ్ల ప్రత్యేక ప్రణాళిక ఎందుకు ప్రకటించడం లేదు?

ప్రభుత్వానికి ప్రధాన డిమాండ్లు:

- మూడు జిల్లాల్లోని పరిశ్రమల సంఖ్య, పెట్టుబడులు, ఉద్యోగుల వివరాలతో శ్వేతపత్రం విడుదల చేయాలి.
- స్థానిక అర్హత కలిగిన యువతకు ఉద్యోగాల్లో ప్రాధాన్యత కల్పించే చట్టబద్ధమైన విధానం రూపొందించాలి.
- కొత్త పరిశ్రమలు స్థాపించడంతో పాటు మూతపడిన పరిశ్రమలను పునరుద్ధరించాలి.
- నిరుద్యోగ యువతకు పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా నైపుణ్య శిక్షణ ఇవ్వాలి.
- మహిళలకు ప్రత్యేక ఉపాధి అవకాశాలు కల్పించాలి.
- రైతులకు మార్కెట్ కల్పించే వ్యవసాయ ఆధారిత పరిశ్రమలను ప్రోత్సహించాలి.
- పరిశ్రమల కాలుష్యం, కార్మికుల భద్రత, కనీస వేతనాల అమలుపై కఠిన పర్యవేక్షణ చేయాలి.
- పరిశ్రమల అభివృద్ధి అంటే ప్రజల జీవితాల్లో మార్పు రావాలి!

పరిశ్రమల వల్ల యాజమాన్యాలకు లాభాలు రావడమే కాకుండా స్థానిక యువతకు ఉద్యోగాలు, రైతులకు మార్కెట్, మహిళలకు ఉపాధి, చిన్న వ్యాపారులకు అవకాశాలు కలగాలి. పరిశ్రమల కోసం భూములు కేటాయించే సమయంలో రైతుల ప్రయోజనాలు, స్థానిక ప్రజల అభిప్రాయాలు, పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు.

డాక్టర్ చిలకల శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ.. మూడు ఉమ్మడి జిల్లాల పారిశ్రామిక పరిస్థితిపై ప్రభుత్వం తక్షణమే సమీక్ష నిర్వహించి, పరిశ్రమల శాఖ, కార్మిక శాఖ, కాలుష్య నియంత్రణ మండలి అధికారులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయాలని కోరారు. పరిశ్రమల సంఖ్య, స్థానిక ఉద్యోగుల వివరాలు, భవిష్యత్తు పెట్టుబడులు, ఉద్యోగాల కల్పన లక్ష్యాలతో కూడిన సమగ్ర నివేదికను ప్రజల ముందుంచాలని డిమాండ్ చేశారు. స్థానిక యువతకు ఉపాధి కల్పించే విషయంలో ప్రభుత్వం ఇకనైనా నిర్లక్ష్యం వీడి స్పష్టమైన కార్యాచరణ ప్రకటించాలని హెచ్చరించారు.

రైతు రాజుగా మారినప్పుడే దేశ అభివృద్ధి : కొనగల రమేష్

- గ్రామాల్లో పర్యటించి రైతులు, మహిళలతో జీవనోపాధి, ఉపాధి అవకాశాలపై చర్చ



దేవరుప్పుల విశాలభారతి: జనగామ జిల్లా దేవరుప్పుల మండలంలోని ధర్మపురం, మన్నవ్ గ్రామాల్లో జస్టిస్ మూవ్‌మెంట్ ఆఫ్ ఇండియా వ్యవస్థాపక సభ్యులు కొనగల రమేష్ బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల ప్రజలు, పాలకవర్గ సభ్యులు డప్పు చప్పుళ్లతో ర్యాలీ నిర్వహించి ఘన స్వాగతం పలికారు. అనంతరం గ్రామాల్లో నిర్వహించిన సమావేశాల్లో కొనగల రమేష్ మాట్లాడుతూ.. రైతు అరుగాలం కష్టపడి పండించిన పంటను అమ్మగా వచ్చిన ఆదాయాన్ని మధ్య దళారులు గంటలోనే సంపాదిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు తాము పండించిన పంటలను క్వింటాళ్ల చొప్పున అమ్ముతూ, తిరిగి నిత్యావసర వస్తువులను కిలోల చొప్పున కొనుగోలు చేయాల్సి రావడం బాధాకరమన్నారు. రైతులు కేవలం పంటల ఉత్పత్తిదారులుగా కాకుండా, తమ ఉత్పత్తులకు తామే మార్కెటింగ్ చేసుకునే స్థాయికి ఎదిగినప్పుడే రైతులకు నిజమైన మేలు జరుగుతుందని తెలిపారు. రైతు రాజుగా మారినప్పుడే దేశ అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. అనంతరం గ్రామాల్లో జీవనోపాధి మార్గాలు, ఉపాధి అవకాశాలపై మహిళలు, రైతులతో చర్చించారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు దొపాటి అశ్వినిరవి, పారిపెల్లి బాలమ్మశ్రీనివాస్, సంస్థ రాష్ట్ర అధ్యక్షులు కన్నారపు పరుశరాములు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అంగిరేకుల శ్రీకాంత్, జనగామ జిల్లా కన్వీనర్ గాదేపాక శ్రీనివాస్, కోకన్వీనర్లు తోడేటి ఆంజనేయులు, ఎండీ రబియా, దేవరుప్పుల మండల జేఏంఐ సభ్యులు బోసగిరి యాకస్వామి, పి.సరూప, మహిళలు, రైతులు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

రాష్ట్రవ్యాప్తంగా ఒకేసారి ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ప్రారంభం

- అర్హులైన ప్రతి కుటుంబానికి బీమా భద్రత కల్పించడమే లక్ష్యం
- గ్రామాలు, మున్సిపల్ వార్డుల్లో పండుగ వాతావరణంలో ప్రారంభోత్సవాలు
- రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు

మహబూబాబాద్ జిల్లా విశాల భారతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్




రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి జీవిత బీమా భద్రత కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని రాష్ట్రవ్యాప్తంగా ఒకేసారి ప్రారంభించేందుకు అధికార యంత్రాంగం సిద్ధమవుతోంది. నవంబర్ 19న సిద్దిపేట జిల్లాలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ పథకాన్ని లాంఛనంగా ప్రారంభించనుండగా, అదే సమయంలో రాష్ట్రంలోని అన్ని జిల్లాలు, మండలాలు, గ్రామాలు, మున్సిపల్ వార్డుల్లోనూ ప్రారంభోత్సవాలు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఆదేశించారు. బుధవారం హైదరాబాద్ నుంచి జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పథకం ప్రారంభోత్సవ ఏర్పాట్లు, దరఖాస్తుల సేకరణ, ప్రజల్లో అవగాహన కల్పించే అంశాలపై సమీక్షించారు. మహబూబాబాద్ కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ గ్రామాలు, మున్సిపల్ వార్డుల్లో స్థానిక ప్రజాప్రతినిధుల భాగస్వామ్యంతో పండుగ వాతావరణంలో ప్రారంభోత్సవ కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ప్రతి గ్రామం, మున్సిపల్ వార్డులో ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసి, ప్రతి కుటుంబం నుంచి బీమా పొందే వ్యక్తి, నామినీ వివరాలతో కూడిన దరఖాస్తులను సేకరించాలని ఆదేశించారు.

దరఖాస్తుల నమోదులో తప్పిదాలకు తావుండకూడదు.

దరఖాస్తుల సేకరణ, వివరాల నమోదులో ఎలాంటి పొరపాట్లకు అవకాశం లేకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు. అర్హత కలిగిన ఏ కుటుంబం కూడా ఈ పథకం ప్రయోజనాలకు దూరం కాకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పథకం ప్రయోజనాలు, దరఖాస్తు విధానం, ప్రత్యేక శిబిరాల నిర్వహణ వివరాలను ప్రజలకు విస్తృతంగా చేరవేయాలని తెలిపారు. ప్రింట్, ఎలక్ట్రానిక్, సోషల్ మీడియాతో పాటు గ్రామాల్లో మైక్ ప్రచారం, పోస్టర్లు, కరపత్రాల ద్వారా ప్రజల్లో అవగాహన కల్పించాలని ఆదేశించారు. సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ జిల్లా కలెక్టర్లు పథకం అమలును నిరంతరం పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ముఖ్య ప్రణాళిక అధికారి వల్లూరి శ్రీనివాసరావు, జిల్లా పౌర సంబంధాల అధికారి రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

చేయూత అందించడమే ప్రజా ప్రభుత్వం లక్ష్యం

- 460 మందికి చేయూత పెన్షన్ పత్రాలు పంపిణీ చేసిన భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు



వాజేడు, విశాలభారతి: ములుగు జిల్లా వాజేడు మండల కేంద్రంలో ప్రజా ప్రభుత్వం చేపట్టిన చేయూత పెన్షన్ ఆర్థిక భరోసా పథకం ద్వారా 460 మందికి పెన్షన్ మంజూరు పత్రాలు భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు చేతుల మీదుగా లబ్ధిదారులకు అందించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకటరావు మాట్లాడుతూ.. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన నుండి అనేక సంక్షేమ పథకాలు రైతు భరోసా, ఇందిరమ్మ ఇల్లు మహాలక్ష్మి పథకంలో మహిళలకు ఫ్రీ బస్, 500 రూపాయల గ్యాస్, రైతు రుణమాఫీ,అనేక సంక్షేమ పథకాలను ప్రజలకు అందిస్తుందని రేపటి నుండి మరో పథకానికి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శ్రీకారం చుట్టబోతున్నారని రాష్ట్రంలో రేషన్ కార్డ్ కలిగి ఉన్న ప్రతి కుటుంబానికి ఇందిరా జీవిత బీమా పథకాన్ని కల్పించడం జరుగుతుందని ఆయన అన్నారు. అనంతరం అనారోగ్యంతోమృతి చెందిన అలీ రాంబాబు మరియు గుగ్గిళ్ళ ఎల్లమ్మ కుటుంబాలను ఎమ్మెల్యే వెంకట్రావు పరామర్శించారు. అలి రాంబాబు కుటుంబ సభ్యులకు పదివేల రూపాయలు హార్దిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో మండల తాసిల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీవో కొండ కృపాకర్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు విక్రమ్ బాబు, కాంగ్రెస్ పార్టీ నాయకులు చెన్నం ఎల్లయ్య, కళ్యాణ్, మాజీ జెడ్పిటిసి తల్లాడి పుష్పలత, తల్లాడి ఆదినారాయణ, సంజీవ, మండల సర్పంచ్ ఫోరం అధ్యక్షులు భరత్ కుమార్, వివిధ గ్రామ పంచాయతీల సర్పంచులు మరియు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

జనగామ బార్ అసోసియేషన్‌లో నూతన కార్యదర్శులకు ఘన సన్మానం


జనగామ విశాల భారతి: జనగామ బార్ అసోసియేషన్‌లో బుధవారం న్యాయవాదుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర న్యాయవాదుల ఫెడరేషన్ అధ్యక్షుడిగా ఎన్నికైన గోళీ విప్లవ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన బండ దయాకర్ రెడ్డిలను జనగామ బార్ అసోసియేషన్ న్యాయవాదులు ఘనంగా సన్మానించారు.ఇటీవల రంగారెడ్డి న్యాయస్థాన సముదాయంలో రాష్ట్రంలోని వివిధ బార్ అసోసియేషన్ల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులతో నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర న్యాయవాదుల ఫెడరేషన్ సమావేశంలో గోళీ విప్లవ రెడ్డిని అధ్యక్షుడిగా, బండ దయాకర్ రెడ్డిని ప్రధాన కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన వారిని జనగామ బార్ అసోసియేషన్ న్యాయవాదులు శాలువాలతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు రాజయ్య, ప్రధాన కార్యదర్శి సత్తయ్య, శ్రీమాన్ బాలరాజు, సీనియర్ న్యాయవాదులు మంచాల రవీందర్, హరిచంద్ర ప్రసాద్, వజ్జుల నర్సిరెడ్డి, శంకర, స్వప్న, నాగభూషణం, ప్రశాంత్ తదితర న్యాయవాదులు పాల్గొన్నారు.

నూతన చేయూత పెన్షన్లతో అర్హులకు ఆర్థిక భరోసా

- కొత్తగూడలో మంత్రి సీతక్క
- గార్లలో ఎమ్మెల్యే కోరం కనకయ్య చేతుల మీదుగా పెన్షన్ ప్రొసీడ్ పత్రాల పంపిణీ
- లబ్ధిదారులకు ప్రభుత్వ చేయూత.. రెండు మండలాల్లో కార్యక్రమాలు

మహబూబాబాద్ జిల్లా విశాల భారతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్: అర్హులైన పేదలకు సామాజిక భద్రత కల్పిస్తూ, ఆర్థికంగా అండగా నిలిచేందుకు ప్రభుత్వం నూతనంగా మంజూరు చేసిన చేయూత పెన్షన్ల ప్రొసీడ్ పత్రాలను బుధవారం మహబూబాబాద్ జిల్లాలో పంపిణీ చేశారు. కొత్తగూడ మండలంలో రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క, గార్ల మండలంలో ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య లబ్ధిదారులకు స్వయంగా పెన్షన్ ప్రొసీడ్ పత్రాలను అందజేశారు. నూతనంగా పెన్షన్లు మంజూరైన లబ్ధిదారులకు పత్రాలు అందించడంతో ఆయా కుటుంబాల్లో ఆనందం వ్యక్తమైంది. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. పెన్షన్ల ద్వారా వృద్ధులు, దివ్యాంగులు, ఇతర అర్హులైన వర్గాలకు ఆర్థిక తోడ్పాటు అందనుంది. ఈ కార్యక్రమాల్లో ఇన్చార్జి అదనపు కలెక్టర్, స్థానిక సంస్థల అధికారులు, హౌసింగ్ పీడీ పురుషోత్తం, డీఆర్డీఓ ప్రాజెక్ట్ డైరెక్టర్ మధుసూదన రాజు, కొత్తగూడ, గార్ల మండలాల ఎంపీడీవోలు, తహసీల్దారులు, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పాటతోనే ప్రజల్లో చైతన్య జ్వాలలు



- సమాజాన్ని కదిలించే శక్తివంతమైన ఆయుధం పాట
- మూడు నిమిషాల గీతం.. గంటల ఉపన్యాసం చేయలేని పని చేస్తుంది
- సైబర్ క్రైమ్ ఎస్పై బి. కరుణాకర్

మహబూబాబాద్ జిల్లా విశాల భారతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్.

పాట అనేది కేవలం వినోద సాధనం మాత్రమే కాదని..ప్రజలను చైతన్యవంతం చేస్తూ సమాజంలో ఆలోచనల విప్లవాన్ని రగిలించే శక్తివంతమైన సాధనమని సైబర్ క్రైమ్ ఎస్పై బి. కరుణాకర్ అన్నారు. పాటలోని భావం ప్రజల హృదయాలను నేరుగా తాకుతుందని, సామాజిక మార్పునకు ప్రేరణగా నిలుస్తుందని పేర్కొన్నారు. మహబూబాబాద్ జిల్లా కేంద్ర గ్రంథాలయంలో 59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకొని బుధవారం నిర్వహించిన దేశభక్తి గీతాల పోటీలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పాట పరిధి చిన్నదైనా దాని పవర్ ఎంతో గొప్పదని, ఎక్కువ పెట్టిన ధనుస్సు కంటే పాట మరింత శక్తివంతమైనదని అభివర్ణించారు. గంటల తరబడి సాగే ఉపన్యాసం చెప్పలేని విషయాన్ని మూడు నిమిషాల పాట తన రాగం, భావంతో ప్రజలకు చేరవేస్తుందని వివరించారు. పాటలోని సాహిత్యం మనిషిని ఆలోచింపజేస్తుందని, సమాజంలోని వాస్తవాలను కళ్లకు కట్టినట్లు చూపిస్తూ ప్రజల్లో చైతన్యాన్ని నింపుతుందని అన్నారు.

విద్యార్థులు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి.

ఈ సందర్భంగా విద్యార్థిని, విద్యార్థులకు సైబర్ నేరాలపై ఎస్పై బి. కరుణాకర్ సమగ్ర అవగాహన కల్పించారు. ప్రస్తుత సాంకేతిక యుగంలో ఆన్‌లైన్ మోసాలు పెరుగుతున్న నేపథ్యంలో అపరిచితుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్, సందేశాలు, అనుమానాస్పద లింకుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వ్యక్తిగత బ్యాంకు వివరాలు, ఓటీపీలు, పాస్‌వర్డ్‌లను ఎవరికీ వెల్లడించవద్దని, సైబర్ నేరాల బారిన పడకుండా ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలని వివరించారు. కార్యక్రమంలో గ్రంథాలయ లైబ్రేరియన్లు జి. విజేందర్, రుద్రారపు వీరేందర్ పాల్గొన్నారు. దేశభక్తి గీతాల పోటీలకు తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు బండ వెంకన్న, డి. ప్రవీణ్ న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. గ్రంథాలయ సిబ్బంది బొడ్డుపల్లి భూలక్ష్మి, యాదమ్మ, ఉపాధ్యాయులు ప్రవీణ్, జి. సుమన్, సురాంబా తనూజ, హిమబిందు, గ్రంథాలయ పాఠకులు, పుస్తక ప్రియులు పాల్గొన్నారు.

కార్యకర్త కుటుంబాన్ని పరామర్శించిన మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు



దేవరుప్పుల విశాలభారతి: దేవరుప్పుల మండలం కడవెండి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్త గండి యాకయ్య ఇటీవల మృతి చెందడంతో మాజీ మంత్రి, పాలకుర్తి మాజీ ఎమ్మెల్యే ఎర్రబెల్లి దయాకర్ రావు ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా యాకయ్య నివాసానికి వెళ్లిన ఎర్రబెల్లి దయాకర్ రావు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఆరాంఘర్ బ్రిడ్జి వద్ద కత్తితో బెదిరించి మొబైల్ ఫోన్ దోపిడీ

రాజేంద్రనగర్, విశాల భారతి : ఆరాంఘర్ బ్రిడ్జి సమీపంలో కత్తితో బెదిరించి మొబైల్ ఫోన్ దోపిడీకి పాల్పడిన ఇద్దరు నిందితులను మైలార్‌దేవ్‌పల్లి పోలీసులు కేవలం రెండు గంటల్లోనే పట్టుకున్నారు. ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబ్‌నగర్ నుంచి హైదరాబాద్‌కు వస్తున్న కొల్లోజు శ్రీకాంత్ (38) ఈ నెల 18వ తేదీ ఉదయం సుమారు 8.30 గంటలకు ఆరాంఘర్ వద్ద బస్సు దిగారు. అనంతరం దుర్గానగర్ వైపు ఉన్న బ్రిడ్జి సమీపంలోని మరుగుదొడ్డికి వెళ్లి తిరిగి ఆరాంఘర్ బస్టాప్ వైపు నడుచుకుంటూ వస్తుండగా, సుమారు 20 నుంచి 22 సంవత్సరాల వయస్సు గల ఇద్దరు గుర్తుతెలియని యువకులు వెనుక నుంచి వచ్చి ఆయనను అడ్డుకున్నారు. తమ వద్ద ఉన్న కత్తితో బెదిరించి మొబైల్ ఫోన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. బాధితుడు నిరాకరించడంతో అతనిపై దాడికి దిగారు.

విద్యార్థులు సైబర్ నేరాలపై మొబైల్ ఇంటర్నెట్ వినియోగంలో అప్రమత్తంగా ఉండాలి

- యాచారం సిఐ నందీశ్వర్ రెడ్డి




విశాల భారతి ఇబ్రహీంపట్నం: విద్యార్థులు మొబైల్ ఫోన్లు ఇంటర్నెట్ వినియోగంలో అప్రమత్తంగా ఉండాలని, సైబర్ నేరగాళ్ల బారిన పడకుండా జాగ్రత్త వహించాలని యాచారం పోలీసు స్టేషన్ ఇన్స్పెక్టర్ (SHO) ఎ. నందీశ్వర్ రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం గుల్ గల్,యాచారం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సైబర్ మోసాలు బాలల రక్షణ (Child Safety) పై యాచారం పోలీసులు ఒక ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ హెచ్ ఓ ఎ. నందీశ్వర్ రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత డిజిటల్ యుగంలో సాంకేతికత ఎంత ఉపయోగకరమో, అంతే ప్రమాదకరంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. గుర్తుతెలియని వ్యక్తుల నుంచి వచ్చే లింకులను క్లిక్ చేయవద్దని, ఓటీపీ (OTP) లు వ్యక్తిగత వివరాలను ఎవరికీ షేర్ చేయకూడదని,విద్యార్థులకు స్పష్టం చేశారు. ఆన్‌లైన్ గేమింగ్ యాప్‌లు, సోషల్ మీడియా వినియోగంలో పరిమితులు పాటించాలని సూచించారు. ముఖ్యంగా బాలల భద్రతకు సంబంధించి, ఎవరైనా వేధించినా లేదా అనుమానాస్పదంగా ప్రవర్తించినా వెంటనే ఉపాధ్యాయులకు లేదా తల్లిదండ్రులకు తెలపాలని కోరారు. ఏదైనా సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 టోల్ ఫ్రీ నెంబర్‌కు లేదా స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయాలని అవగాహన కల్పించారు.

కొత్త పింఛన్లతో పేదలకు భరోసా

- చేయూత పింఛన్ల మంజూరు పత్రాలు పంపిణీ చేసిన ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి
- పెద్దఅంబర్‌పేట తార కన్వెన్షన్‌లో పంపిణీ కార్యక్రమం
- అనాజ్‌పూర్‌లోనూ లబ్ధిదారులకు పింఛన్ పత్రాల అందజేత
- అబ్దుల్లాపూర్‌మెట్ మండల గ్రామాలతో పాటు రెండు డివిజన్లకు లబ్ధి
- అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యం

విశాలభారతి, అబ్దుల్లాపూర్‌మెట్ :



అర్హులైన పేద కుటుంబాలకు సంక్షేమ పథకాల ద్వారా అండగా నిలవడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. నూతనంగా మంజూరైన చేయూత పింఛన్లు వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు, బలహీన వర్గాల కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పిస్తాయని పేర్కొన్నారు. పెద్దఅంబర్‌పేటలోని తార కన్వెన్షన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో కొత్తగా మంజూరైన పింఛన్ల పత్రాలను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. అబ్దుల్లాపూర్‌మెట్ మండల పరిధిలోని అబ్దుల్లాపూర్, అనాజ్‌పూర్, బలిజగూడ, బండరావిర్యాల, చిన్న రవిర్యాల, బాటసింగారం, గుంతపల్లి, ఇనాంగూడ, కవాడిపల్లి, లస్కర్‌గూడ, మజీద్‌పూర్, పిగిలిపూర్, జాఫర్‌గూడ, గండిచెర్వు తదితర గ్రామాలతో పాటు మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ నాగోల్ సర్కిల్ 11 పరిధిలోని పెద్దఅంబర్‌పేట, కుంట్లూర్ డివిజన్లకు చెందిన అర్హులైన లబ్ధిదారులకు ఈ పింఛన్లు మంజూరయ్యాయి. కొత్తగా పింఛన్లు మంజూరు కావడంతో లబ్ధిదారుల కుటుంబాల్లో ఆనందం వ్యక్తమవుతోంది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సంక్షేమంతో పాటు అభివృద్ధికి ప్రభుత్వం సమాన ప్రాధాన్యత ఇస్తోందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందేలా కృషి చేస్తామని తెలిపారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా పాలన సాగిస్తూ పేదలకు అండగా నిలుస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో శ్రీనివాస్ రెడ్డి, ఎంపీడీవో శ్రీవాణి, నాగోల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ సంపత్ కుమార్, ఎంపీవో షఫీ ఉల్లా ఖాన్, నాయకులు శేఖర్ మామ, బింగి దేవదాస్ గౌడ్, చిలుక మధుసూదన్ రెడ్డి, మాజీ వైస్ చైర్మన్లు చామ సంపూర్ణ విజయ శేఖర్ రెడ్డి, సిద్ధంకి కృష్ణారెడ్డి, మాజీ సర్పంచ్ మూల మహేష్ గౌడ్, సర్పంచులు కోట ప్రభాకర్ రెడ్డి, మందుగుల విజయశ్రీశైలం గౌడ్, కొలను లక్ష్మీ ప్రసన్న రవీందర్ రెడ్డి, ఉప్పు మాధవి నవీన్ కుమార్, పబ్బత్ బాలకిషన్ గౌడ్, కందికంటి విజయ్ కుమార్, గౌరీ శంకర్ చారి, అంతటి రాఘవేందర్ గౌడ్, అల్లే ఐలయ్య యాదవ్, ఎర్ర వెంకటేష్ యాదవ్, రాచపాక నవనీత మహేష్, మేడిపల్లి ప్రియా చంద్రశేఖర్, అంతటి హేమలత జంగయ్య గౌడ్, జక్కా రవీందర్ రెడ్డి, వివిధ గ్రామాల ప్రజాప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శులు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

చౌటుప్పల్ పురపాలక సంఘం 13వ వార్డులో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం

- 13వ వార్డును పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తా.చైర్ పర్సన్

మొగుదాల పావని రమేష్ గౌడ్



చౌటుప్పల్,విశాలభారతి: ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలలో భాగంగా చౌటుప్పల్ పురపాలక సంఘం పరిధిలోని 13వ వార్డులో ముమ్మరంగా పారిశుధ్య పనులు చేపట్టారు. పాత బజారు ప్రాంతం కావడంతో పాటు స్లం బస్తీగా ఉన్న ఈ ప్రాంతంలో పూర్తిస్థాయి శానిటేషన్ పనులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా రోడ్లకు ఇరువైపులా ఉన్న పిచ్చి మొక్కలు, కంప చెట్లను జేసీబీ ద్వారా తొలగించారు. అలాగే రోడ్లపై ఉన్న మట్టి కుప్పలను డోజర్ సహాయంతో చదును చేయగా, పారిశుధ్య కార్మికులు మోరీలను పూర్తిగా శుభ్రం చేశారు.ఈ కార్యక్రమాన్ని మున్సిపల్ చైర్ పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్ స్వయంగా పర్యవేక్షించారు. ఈ సందర్భంగా స్థానిక వార్డు కౌన్సిలర్ బత్తుల వాణి విప్లవ్ కుమార్ గౌడ్ తో కలిసి వార్డులోని పలు సమస్యలపై చర్చించి, తగు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ గారు మాట్లాడుతూ.. 13వ వార్డులో ప్రధానంగా శాశ్వత మోరీల నిర్మాణానికి అంచనా పనులు ప్రారంభించామని, మరికొద్ది నెలల్లో పూర్తిస్థాయి నిర్మాణాలు చేస్తామని తెలిపారు. వార్డు అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ శానిటరీ ఇన్స్పెక్టర్ హనుమాన్ ప్రసాద్, పర్యావరణ ఇంజనీర్ రేణుకుమార్, వార్డ్ అధికారి కుమార్, బిల్ కలెక్టర్ బుచ్చి రాములు, జవాన్లు అంజయ్య, నరసింహ, వర్క్ ఇన్స్పెక్టర్ సంతోష్‌కుమార్, వాటర్ మెన్లు, ఎలక్ట్రీషియన్, పారిశుధ్య కార్మికులు మరియు కాలనీ నాయకులు చెవగొని వెంకటేశం, వర్కాల వెంకట్ కుమార్, తొర్పునూరి రవి, గుయ్యని జంగయ్య, మార్గం స్వామి, మార్గం మల్లయ్య తదితర కాలనీ వాసులు పాల్గొన్నారు.

30 ఏళ్ల తర్వాత ఒక్కటైన బాల్య మిత్రులు

- ఆహ్లాదంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం
- దశాబ్దాల తర్వాత ఒక్కటైన ఎంబీ స్కూల్ 1995-96' బ్యాచ్
- ఆనందోత్సాహాల మధ్య ఆత్మీయ వేడుక



విశాల భారతి ఇబ్రహీంపట్నం : ఒకటో తరగతి నుంచి ఏడో తరగతి వరకు కలిసి చదువుకుని, 199596 విద్యా సంవత్సరంలో విడిపోయిన బాల్య మిత్రులంతా సరిగ్గా ముప్పై సంవత్సరాల సుదీర్ఘ విరామం తర్వాత మళ్లీ ఒక్కటయ్యారు. ఎంబీ అప్పర్ ప్రైమరీ స్కూల్ 199596 ఏడో తరగతి బ్యాచ్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన 'పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం' అత్యంత ఆహ్లాదకరమైన, మధురమైన వాతావరణంలో ఘనంగా జరిగింది. దశాబ్దాల తర్వాత ఒకరినొకరు కలుసుకోవడంతో వేదిక ప్రాంగణమంతా సందడిగా మారింది. నేడు వివిధ రంగాల్లో స్థిరపడిన వారంతా తమ హోదాలను పక్కనపెట్టి, మళ్లీ చిన్ననాటి విద్యార్థులుగా మారిపోయారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ,యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నాటి తరగతి గది అనుభవాలు, ఆటపాటలు, చిలిపి అల్లరిని గుర్తుచేసుకుంటూ పూర్వ విద్యార్థులు భావోద్వేగానికి లోనయ్యారు. గురువుల బోధనలను, పాఠశాల జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ ఆనందంతో గడిపారు. ఈ అపూర్వ కలయికకు గుర్తుగా అందరూ కలిసి గ్రూప్ ఫోటోలు దిగారు. ఈ ఆత్మీయ సమ్మేళనం జీవితంలో ఎప్పటికీ మర్చిపోలేని ఒక మధుర జ్ఞాపకంగా మిగిలిపోతుందని, ఇకపై కూడా ఇలాగే కలుసుకుంటూ ఒకరికొకరు అండగా నిలవాలని పూర్వ విద్యార్థులు ఆకాంక్షించారు.

రంగారెడ్డి జిల్లా బిజెపి ఎస్సీ మోర్చా కార్యదర్శిగా పెరుమళ్ళ విక్రమ్.

- బిజెపి పార్టీ బలోపేతం చేయడానికి కృషి చేస్తా



విశాల భారతి ఇబ్రహీంపట్నం: రంగారెడ్డి జిల్లా రూరల్ భారతీయ జనతా పార్టీ (బిజెపి) ఎస్సీ మోర్చా కార్యదర్శిగా యాచారం మండలం నందివనపర్తి గ్రామానికి చెందిన పెరుమాళ్ళ విక్రమ్ బుధవారం నియమితులయ్యారు. ఈ సందర్భంగా పెరుమాళ్ళ విక్రమ్ మాట్లాడుతూ, బిజెపి తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కొప్పు బాషా ఆశీస్సులతో, రంగారెడ్డి జిల్లా రూరల్ బిజెపి ఎస్సీ మోర్చా అధ్యక్షులు విట్యాల నరసింహ తనపై నమ్మకంతో ఈ కీలక బాధ్యతలను అప్పగించారని తెలిపారు. తన నియామకానికి సహకరించిన బిజెపి కిసాన్ మోర్చా మాజీ ప్రధాన కార్యదర్శి అంజయ్య , బిజెపి రాష్ట్ర ఎస్సీ మోర్చా సహ కోశాధికారి టి. రవీందర్ , యాచారం మండల బిజెపి అధ్యక్షులు జరుపుల విజయ్ నాయక్ సీనియర్ నాయకులందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. అనంతరం రంగారెడ్డి జిల్లా రూరల్ ఎస్సీ మోర్చా అధ్యక్షులు విట్యాల నరసింహ మాట్లాడుతూ, రాబోయే రోజుల్లో తెలంగాణ రాష్ట్రంలో భారతీయ జనతా పార్టీని అధికారంలోకి తీసుకురావడమే తమ ఏకైక లక్ష్యమని పేర్కొన్నారు. సీనియర్ నాయకుల మార్గదర్శకత్వంలో, నూతన కార్యవర్గం సమన్వయంతో పనిచేస్తూ జిల్లాలో పార్టీని క్షేత్రస్థాయి నుండి మరింత బలోపేతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

ఉస్మానియా యూనివర్సిటీలో దివ్యాంగులకు 4 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలి

- టీచింగ్, నాన్ టీచింగ్ బ్యాక్‌లాగ్ ఉద్యోగాలను తక్షణమే భర్తీ చేయాలి
- వీసీకి వినతిపత్రం అందజేసిన విశ్వవిద్యాలయాల దివ్యాంగుల ఫోరం

ముషీరాబాద్ విశాల భారతి: దివ్యాంగుల హక్కుల పరిరక్షణ చట్టం 2016 ప్రకారం ఉస్మానియా యూనివర్సిటీలో దివ్యాంగులకు కల్పించాల్సిన 4 శాతం రిజర్వేషన్లను పకడ్బందీగా అమలు చేయాలని విశ్వవిద్యాలయాల దివ్యాంగుల ఫోరం డిమాండ్ చేసింది.విశ్వవిద్యాలయంలో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్నటీచింగ్ నాన్ టీచింగ్ బ్యాక్‌లాగ్ ఉద్యోగాలను తక్షణమే భర్తీ చేయాలని కోరుతూ విశ్వవిద్యాలయాల దివ్యాంగుల ఫోరం ఆధ్వర్యంలో బుధవారం ఆర్ట్స్ కళాశాల నుండి విసి కార్యాలయం వరకు పాదయాత్ర చేస్తూ వెళ్లి ఉస్మానియా యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్‌ను ఫోరం ప్రతినిధులు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఫోరం అధ్యక్షులు డాక్టర్ ఎన్ అశోక్ మాట్లాడుతూ దివ్యాంగుల హక్కుల పరిరక్షణ చట్టం 2016లోని నిబంధనల ప్రకారం ప్రభుత్వ ప్రభుత్వ రంగ సంస్థల్లో దివ్యాంగులకు ఉద్యోగ నియామకాల్లో 4 శాతం రిజర్వేషన్లు కల్పించడం చట్టబద్ధమైన హక్కు అని పేర్కొన్నారు.దివ్యాంగ విద్యార్థులకు ఉన్నత విద్యలో సమాన అవకాశాలు కల్పించడంతో పాటు, అర్హత కలిగిన దివ్యాంగ నిరుద్యోగులకు విశ్వ విద్యాలయంలో ఉద్యోగ అవకాశాలు కల్పించడం యాజమాన్యం బాధ్యత అని తెలిపారు.దివ్యాంగులకు జాలి కాదు...హక్కులు కావాలని, చట్టాలు కాగితాలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో అమలైనప్పుడే నిజమైన సామాజిక న్యాయం సాధ్యమవుతుందని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో చంద్రశేఖర్ యాదవ్, కృషిత్ మియా, జి రేణుక, అఫ్రిదుద్దీన్ శిరీష, పల్సా ఆంజనేయులు, ధనమ్మ, బాణాల వెంకటయ్య,వెంకన్న, శ్రీశైలం, నాగేశ్వర్, చెరుకు నాగభూషణం, రామచంద్ర,శ్రీనివాస్, సైదులు యాదవ్, నరసింహ, శిల్ప, మాధవి, రేణుక, నరేష్, వాణి, సమంత, వినోద తదితరులు దివ్యంగ సంఘాల నాయకులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



కస్తూర్బా బాలికల విద్యాలయంను ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్

నిజామాబాద్, విశాలభారతి:



మాక్లూర్ మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని కలెక్టర్ ఇలా త్రిపాఠి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలోని తరగతి గదులను పరిశీలించారు. వంట గది, స్టోర్ రూంలో సరుకుల నాణ్యత తనిఖీ చేశారు. విద్యార్థినుల కోసం సిద్ధం చేసిన ఆహారాన్ని పరిశీలించి, మెనూ వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం నాణ్యమైన పౌష్టిక ఆహారాన్ని అందించాలని నిర్వాహకులను ఆదేశించారు. సరుకుల సరఫరా విషయంలో ఏమైనా ఇబ్బందులు ఉంటే అధికారుల దృష్టికి తేవాలని, స్టాక్ రిజిస్టర్ పక్కాగా నిర్వహించాలని సూచించారు. కాగా, గత కొన్ని రోజులుగా నిత్యావసరాలలో కొన్ని రకాల సరుకులను కాంట్రాక్టర్ పంపకపోవడం వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని స్పెషల్ ఆఫీసర్ కలెక్టర్ దృష్టికి తేగా, ఎప్పటికప్పుడు నిత్యావసరాల కోసం విద్యా శాఖ ద్వారా ప్రత్యేకంగా నిధులను అందజేయించారు. నిత్యావసరాలు సమకూర్చే కాంట్రాక్ట్ ఏజెన్సీని సంప్రదించి సరుకులు సక్రమంగా సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలని, లేని పక్షంలో ఏజెన్సీకి షోకాజ్ నోటీసులు ఇచ్చి బ్లాక్ లిస్టులో పెడతామని కలెక్టర్ హెచ్చరించారు. కాగా, బాలికల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని, బయటి వ్యక్తులను లోనికి అనుమతించకూడదని ఆదేశించారు. ఇంటర్ మీడియట్ విద్యార్థినులకు నీట్ కోచింగ్ అందిస్తుండడం పట్ల కలెక్టర్ అభినందిస్తూ, అత్యధిక మందికి ప్రవేశాలు లభించేలా చూడాలని నిర్వాహకులకు సూచించారు. ఈ సందర్భంగా కేజీబీవీ విద్యార్థినులతో కలెక్టర్ ఇలా త్రిపాఠి భేటీ అయ్యారు. వారికి పలు ప్రశ్నలు వేస్తూ అభ్యాసన సామర్థ్యాన్ని అంచనా వేశారు. తన వెంట తెచ్చిన డైరీలు, చాక్లెట్లు, బహుమతులను అందించారు. చక్కగా చదువుకోవాలని, అదే సమయంలో వ్యక్తిగత భద్రత విషయంలో ఏమరుపాటుగా ఉండకుండా అనుక్షణం అప్రమత్తంగా వ్యవహరించాలని జాగ్రత్తలు సూచించారు. ఏవైనా ఇబ్బందులు ఎదురైతే అధికారులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ భుజంగరావు, ఇంచార్జి డీఈఓ సాయాగౌడ్, ఎంఈఓ సత్యనారాయణ, కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ స్రవంతి తదితరులు ఉన్నారు.

సీపీఐ హెచ్ సెక్షన్‌కు నూతన కమిటీ ఎన్నిక

- శాఖ కార్యదర్శిగా లావుడియా శంకర్ నాయక్ ఏకగ్రీవ ఎన్నిక
- సహాయ కార్యదర్శిగా గోపాల్‌దాస్ గిరి ఎన్నిక
- ఎనిమిది మందితో నూతన కార్యవర్గం ఏర్పాటు
- నూతన కమిటీకి నాయకుల అభినందనలు
- పార్టీ బలోపేతానికి క్రమ-శిక్షణతో పనిచేయాలని పిలుపు

విశాలభారతి, అబ్దుల్లాపూర్‌మెట్ :

రావి నారాయణరెడ్డి కాలనీ ఫేజ్ 3లో బుధవారం భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) హెచ్ సెక్షన్ శాఖ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో శాఖ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శాఖ కార్యదర్శిగా కామ్రేడ్ లావుడియా శంకర్ నాయక్, సహాయ కార్యదర్శిగా గోపాల్‌దాస్ గిరి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీరితో పాటు ఎనిమిది మందితో కూడిన నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ.. నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులకు అభినందనలు తెలిపారు. పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేయాలని సూచించారు. పార్టీ బలోపేతానికి క్రమశిక్షణతో పనిచేస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని పిలుపునిచ్చారు. ప్రజా ఉద్యమాలను మరింత బలోపేతం చేయడంలో నూతన కమిటీ కీలక పాత్ర పోషించాలని ఆకాంక్షించారు. ఈ సమావేశంలో సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కామ్రేడ్ ముత్యాల యాదిరెడ్డి, అబ్దుల్లాపూర్‌మెట్ మండల కార్యదర్శి కామ్రేడ్ అజ్మీరా హరిసింగ్ నాయక్, మండల సహాయ కార్యదర్శి కేతరాజు నరసింహ, మహిళా సమాఖ్య నాయకురాలు కాటి అరుణ తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ హెచ్ సెక్షన్‌కు నూతన కమిటీ ఎన్నిక



- శాఖ కార్యదర్శిగా లావుడియా శంకర్ నాయక్ ఏకగ్రీవ ఎన్నిక
- సహాయ కార్యదర్శిగా గోపాల్‌దాస్ గిరి ఎన్నిక
- ఎనిమిది మందితో నూతన కార్యవర్గం ఏర్పాటు
- నూతన కమిటీకి నాయకుల అభినందనలు
- పార్టీ బలోపేతానికి క్రమ-శిక్షణతో పనిచేయాలని పిలుపు

విశాల భారతి, అబ్దుల్లాపూర్‌మెట్ :

రావి నారాయణరెడ్డి కాలనీ ఫేజ్ 3లో బుధవారం భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) హెచ్ సెక్షన్ శాఖ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో శాఖ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శాఖ కార్యదర్శిగా కామ్రేడ్ లావుడియా శంకర్ నాయక్, సహాయ కార్యదర్శిగా గోపాల్‌దాస్ గిరి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీరితో పాటు ఎనిమిది మందితో కూడిన నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ.. నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులకు అభినందనలు తెలిపారు. పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేయాలని సూచించారు. పార్టీ బలోపేతానికి క్రమశిక్షణతో పనిచేస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని పిలుపునిచ్చారు. ప్రజా ఉద్యమాలను మరింత బలోపేతం చేయడంలో నూతన కమిటీ కీలక పాత్ర పోషించాలని ఆకాంక్షించారు. ఈ సమావేశంలో సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కామ్రేడ్ ముత్యాల యాదిరెడ్డి, అబ్దుల్లాపూర్‌మెట్ మండల కార్యదర్శి కామ్రేడ్ అజ్మీరా హరిసింగ్ నాయక్, మండల సహాయ కార్యదర్శి కేతరాజు నరసింహ, మహిళా సమాఖ్య నాయకురాలు కాటి అరుణ తదితరులు పాల్గొన్నారు.

చేయూత సభలో ప్రోటోకాల్ రగడ.. తోపులాట!

- వేదికపై అనర్హుల కూర్చోవడంపై ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి అభ్యంతరం
- చంపాపేట్ మల్టీపర్పస్ ఫంక్షన్‌హాల్‌లో పింఛన్ పత్రాల పంపిణీ
- ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్ పట్నం మహేందర్‌రెడ్డి
- ప్రోటోకాల్ వివాదంతో ఇరువర్గాల మధ్య తోపులాట
- వేదికపైనే పడుకుని ఎమ్మెల్యే నిరసన



విశాలభారతి, ఎల్బీనగర్: ఎల్బీనగర్ నియోజకవర్గ పరిధిలోని చంపాపేట్ మల్టీపర్పస్ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన చేయూత పింఛన్ మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమం రాజకీయ వివాదానికి వేదికైంది. సభా వేదికపై ప్రోటోకాల్ పాటించకుండా కొందరు వ్యక్తులు కూర్చోవడంపై ఎల్బీనగర్ నియోజకవర్గం ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అభ్యంతరం వ్యక్తం చేయడంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం చోటుచేసుకుని చివరకు తోపులాటకు దారితీసింది. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ విప్ పట్నం మహేందర్‌రెడ్డి ముఖ్య అతిథిగా, ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో భాగంగా సభా వేదికపై ప్రోటోకాల్‌కు సంబంధం లేని వ్యక్తులు సైతం కూర్చోవడంపై ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి అభ్యంతరం వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య ఉద్రిక్తత నెలకొని తోపులాట జరిగింది. దీంతో తీవ్ర అసహనం వ్యక్తం చేసిన ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి వేదికపైనే పడుకుని నిరసన తెలిపారు. చేయూత పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ప్రోటోకాల్ వివాదం తలెత్తడం, ప్రజాప్రతినిధుల సమక్షంలోనే తోపులాట చోటుచేసుకోవడం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.

పథకాలు పేదల గడపకు చేరితేనే ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుంది

- పేదల జీవితాల్లో వెలుగులు నింపటమే లక్ష్యంగా పనిచేస్తున్నాం
- నిధులు, పథకాలు తెచ్చే బాధ్యత నాది
- అమలు బాధ్యత అధికారులది. ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి
- మన్నెగూడ, పెద్దఅంబర్‌పేట్‌లో నూతన పెన్షన్ పత్రాల పంపిణీ



విశాల భారతి ఇబ్రహీంపట్నం / అబ్దుల్లాపూర్మెట్: పేదల సంక్షేమమే లక్ష్యంగా అమలుచేస్తున్న పథకాలు వారి గడపకు చేరినప్పుడే ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుందని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి పేర్కొన్నారు.బుధవారం మన్నెగూడలోని జేఎంఆర్ గార్డెన్స్'లో ఆదిభట్ల, కొంగర, తుర్కయంజాల్, తొర్రూర్ డివిజన్ లకు సంబందించిన లబ్ధిదారులకు నూతన చేయూత పెన్షన్ పత్రాలను పంపిణీ చేశారు. అనంతరం, పెద్దఅంబర్‌పేట్‌లోని 'తారా కన్వెన్షన్'లో కుంట్లూరు, పెద్దఅంబర్‌పేట్ డివిజన్లతో పాటు అబ్దుల్లాపూర్‌మెట్ మండలానికి చెందిన లబ్ధిదారులకు పెన్షన్ పత్రాలను మల్‌రెడ్డి అందజేశారు. పేదల జీవితాల్లో వెలుగులు నింపటమే లక్ష్యంగా ప్రజాప్రభుత్వం పనిచేస్తోందని మల్‌రెడ్డి రంగారెడ్డి తెలిపారు. ఇందులో భాగంగా అమలుచేస్తున్న ప్రతీపథకం పేదల గడపకు చేరినప్పుడే ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుందని చెప్పారు.పదిహేనేళ్ల క్రితం తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు జరిగిన అభివృద్ధి మినహాయిస్తే, అనంతరం ఈ ప్రాంతం అభివృద్ధికి నోచుకోకుండా పోయిందన్నారు. ఇళ్లు, పెన్షన్లు అందని దుస్థితి ఉందేదన్నారు. ప్రజాప్రభుత్వం వచ్చాక ఇళ్లు, పెన్షన్లు, సన్నబియ్యం, ఉచిత కరెంటులాంటి అనేక పథకాలను అమలుచేస్తున్నామని చెప్పారు. పెన్షన్లు రాలేదనే మాట ప్రజల నుంచి వినిపించవద్దని ఎమ్మెల్యే అన్నారు. దరఖాస్తు చేసుకున్న వారందరికీ మంజూరు చేయించే బాధ్యత తనదని అన్నారు.ప్రతీఒక్కరికీ అందుబాటులో ఉండి, వారి గడపకు చేర్చాల్సిన బాధ్యత మాత్రం అధికారులేదనన్నారు. అభివృద్ధిని చూసి ఓర్వలేక విషం చిమ్ముతున్న వారికి ప్రజాకోర్టులో శిక్ష తప్పదని మల్‌రెడ్డి రంగారెడ్డి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో శ్రీనివాస్‌రెడ్డి, కౌన్సిలర్లు కోసిక ఐలయ్య, కాకుమాను సునీలు, ధనరాజ్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

అర్హులైన ప్రతినిరుపేద కుటుంబానికి చేయూత ఫించన్లు

- ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ డైరెక్టర్ సాతిరి ఎల్లేష్
- ఆరుట్ల మాజీ సర్పంచ్ అనంగల్ల యాదయ్య
- ఆరుట్ల చేయూత ఫించన్ల పంపిణీ



విశాల భారతి ఇబ్రహీంపట్నం: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు వెళుతుందని అర్హులైన ప్రతీ నిరుపేద కుటుంబానికి వృద్ధాప్య వితంతు వికలాంగ కల్లుగీత పెన్షన్లు మంజూరు చేయడమే ప్రభుత్వ లక్ష్యమని ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ డైరెక్టర్ సాతిరి ఎల్లేష్ ఆరుట్ల మాజీ సర్పంచ్ అనంగల్ల యాదయ్య అన్నారు. బుధవారం మంచాల మండల పరిధిలోని ఆరుట్ల గ్రామానికి 66 వితంతు ఫించన్లు 8 ఒంటరి మహిళా ఫించన్లు 16 కల్లుగీత ఫించన్లు 36 వికలాంగుల ఫించన్లు మొత్తం 126 మంది లబ్ధిదారులకు మంజూరైనట్లు తెలిపారు ఈకార్యక్రమంలో ఆరుట్ల వార్డు సభ్యులు ఎండి ఇమ్రాన్ ఇందిరమ్మ కమిటీ సభ్యులు చెరుకు నర్సింహా బుట్టి కృష్ణ కాంగ్రెస్ పార్టీ గ్రామ కార్యదర్శి చిందం శ్రీశైలం కాంగ్రెస్ పార్టీ నాయకులు మారగోని మాసయ్య గౌడ్ మార సురేష్ జిలమోని శ్రీనివాస్ వస్పరి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

యంగ్ ఇండియా పోలీస్ స్కూల్‌కు అండగా అరోబిందో ఫార్మా ఫౌండేషన్

- పాఠశాల మౌలిక వసతుల అభివృద్ధికి రూ.కోటి విరాళం అందజేత



రాజేంద్రనగర్, విశాల భారతి : మంచిరేవులలోని యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ అభివృద్ధికి అరోబిందో ఫార్మా ఫౌండేషన్ రూ.కోటి ఆర్థిక సాయాన్ని అందించింది. పాఠశాలలో మౌలిక వసతుల కల్పన, విద్యా సదుపాయాల మెరుగుదల లక్ష్యంగా బుధవారం ఈ విరాళానికి సంబంధించిన చెక్కును రాష్ట్ర డీజీపీ సి.వి. ఆనంద్‌కు అందజేశారు. అరోబిందో ఫార్మా లిమిటెడ్ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్, అరోబిందో ఫార్మా ఫౌండేషన్ డైరెక్టర్ కె. నిత్యానంద రెడ్డి తరపున ఫౌండేషన్ సీఎస్ఆర్ విభాగం అధిపతి ఎస్. సదానంద రెడ్డి, అరోబిందో ఫార్మా లిమిటెడ్ కార్పొరేట్ వ్యవహారాల ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ ఐ.ఎస్.ఆర్. రావు ఈ చెక్కును డీజీపీకి అందజేశారు. ఈ విరాళం అందేలా హైదరాబాద్ పోలీస్ కమిషనర్ మహేశ్ భగవత్, సంగారెడ్డి ఎస్పీ పరితోష్ పంకజ్ ప్రత్యేక చొరవ తీసుకున్నారు. అరోబిందో ఫార్మా ఫౌండేషన్ ప్రతినిధులతో నిరంతరం సంప్రదింపులు జరుపుతూ పాఠశాల అభివృద్ధికి ఆర్థిక సహకారం అందేలా కృషి చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో మెరుగైన విద్యా సదుపాయాల కల్పన, మౌలిక వసతుల బలోపేతం, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంతోపాటు వారి సమగ్ర అభివృద్ధికి అవసరమైన అవకాశాలను కల్పించేందుకు ఈ విరాళం ఎంతగానో ఉపయోగపడనుంది. విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణాన్ని కల్పించడంలో సంస్థ సామాజిక బాధ్యతలో భాగంగా అందించిన ఈ సహకారం కీలకంగా నిలవనుంది. ఈ కార్యక్రమంలో డీజీపీ సి.వి. ఆనంద్, మహిళా భద్రతా విభాగం డీజీ సౌమ్య మిశ్రా, హైదరాబాద్ పోలీస్ కమిషనర్ మహేశ్ భగవత్, ఏడీజీ (శాంతిభద్రతలు) అకున్ సబర్వాల్‌తో పాటు పలువురు పోలీసు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.


జీపీ లేఅవుట్లలో రిజిస్ట్రేషన్ కాని ప్లాట్లకు ఎల్ఆర్ఎస్ కల్పించాలి

- రిజిస్ట్రేషన్ నిషేధం ఎత్తివేసి, తక్కువ ఫీజుతో అనుమతించాలి
- తెలంగాణ రియల్టర్స్ అసోసియేషన్ స్టేట్ ప్రెసిడెంట్ నారగోని ప్రవీణ్ కుమార్



మేడిపల్లి విశాల భారతి : తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా గ్రామ పంచాయతీ పరిధిలోని లేఅవుట్లలో ఒక్కసారి కూడా రిజిస్ట్రేషన్ కాని ప్లాట్లకు ప్రత్యేక ఎల్ఆర్ఎస్ (లేఅవుట్ రెగ్యులరైజేషన్ స్కీమ్) ద్వారా క్రమబద్ధీకరణ అవకాశం కల్పించి, రిజిస్ట్రేషన్లకు అనుమతించాలని తెలంగాణ రియల్టర్స్ అసోసియేషన్ ప్రభుత్వాన్ని కోరింది. గతంలో గ్రామ పంచాయతీలు అనుమతించిన లేఅవుట్లలో ప్లాట్లు విక్రయించినప్పటికీ, ప్రస్తుతం రిజిస్ట్రేషన్లపై నిషేధం ఉండటంతో రియల్టర్లు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అసోసియేషన్ స్టేట్ ప్రెసిడెంట్ నారగోని ప్రవీణ్ కుమార్ తెలిపారు. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో వేలాది ప్లాట్లు రిజిస్ట్రేషన్‌కు నోచుకోకుండా ఉన్నాయని, దీంతో రియల్టర్లు అప్పులు తీర్చలేక, బ్యాంకు రుణాల భారం మోయలేక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. కొనుగోలు చేసిన ప్లాట్లను తమ పిల్లలకు ఆస్తిగా అందించాలనుకునే వారు కూడా రిజిస్ట్రేషన్ సమస్యతో నిరాశకు గురవుతున్నారని తెలిపారు. ఈ పరిస్థితి వందలాది రియల్టర్ల కుటుంబాల ఆర్థిక స్థితిగతులపై ప్రభావం చూపుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం తక్షణమే స్పందించి రిజిస్ట్రేషన్ కాని గ్రామ పంచాయతీ లేఅవుట్లను గుర్తించి, ప్రత్యేక ఎల్ఆర్ఎస్ ద్వారా క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. సామాన్య ప్రజలు, చిన్న రియల్టర్లకు ఆర్థిక భారం కలగకుండా తక్కువ ఫీజులతో రిజిస్ట్రేషన్లకు అవకాశం కల్పించాలని కోరారు. రిజిస్ట్రేషన్ నిషేధం ఉన్న లేఅవుట్లను నిషేధిత జాబితా నుంచి తొలగించి, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియ పునఃప్రారంభించాలని సూచించారు. అలాగే రియల్టర్లు, ప్లాట్ల కొనుగోలుదారులు మోసాలకు గురికాకుండా ప్రభుత్వం స్పష్టమైన మార్గదర్శకాలను జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రజల సంక్షేమం, రియల్ ఎస్టేట్ రంగంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం వెంటనే నిర్ణయం తీసుకోవాలని, లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని తెలంగాణ రియల్టర్స్ అసోసియేషన్ హెచ్చరించింది.

అర్హులైన పేదలకు సంక్షేమ పథకాలే లక్ష్యం : ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్




రాజేంద్రనగర్, విశాల భారతి : అర్హులైన పేదలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించి వారి జీవనోపాధికి భరోసా కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్ అన్నారు. తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న చేయూత సామాజిక భద్రతా పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో భాగంగా వట్టినాగులపల్లి గ్రామానికి చెందిన 16 మంది మహిళలకు వితంతు పెన్షన్లు మంజూరు కాగా, బుధవారం వారికి పెన్షన్ మంజూరు ధ్రువీకరణ పత్రాలను పంపిణీ చేశారు. రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం (పీజేటీఏయూ) ఆడిటోరియంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ముఖ్య అతిథిగా పాల్గొని లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. వట్టినాగులపల్లి గ్రామానికి చెందిన పూజారి పెంటమ్మతో పాటు మరో 16 మంది మహిళలకు వితంతు పెన్షన్లు మంజూరు కావడంతో వారికి పత్రాలను అందజేశారు. గండిపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు క్యాతం అశోక్ యాదవ్, గండిపేట డివిజన్ అధ్యక్షుడు మన్నె నరేందర్ ముదిరాజ్ సమక్షంలో, వట్టినాగులపల్లి గ్రామ మాజీ వార్డు సభ్యులు కుమ్మరి శేఖర్, బుడాల అరుణ్ ముదిరాజ్, డ్రాగన్ గ్రూప్ గోలియ గాయత్రి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని అర్హులైన నిరుపేదలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేయడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు నిర్వాహకులు తెలిపారు. పెన్షన్లు మంజూరు కావడంతో లబ్ధిదారులకు ఆర్థిక భరోసా లభించనుందని, ప్రభుత్వ సహాయంతో తమ జీవనానికి కొంత ఊరట కలుగుతుందని మహిళలు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వట్టినాగులపల్లి గ్రామానికి చెందిన గడిలా నర్సింగ్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణే లక్ష్యం

- మొక్కలు నాటిన మాజీ కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి

నాచారం, విశాలభారతి: కార్తీక మాసం సందర్భంగా మాజీ ఎంపీ జోగినిపల్లి సంతోష్ రావు చేపట్టిన గ్రీన్ ఇండియా ఛాలెంజ్‌లో భాగంగా బుధవారం మల్లాపూర్ వెంకటరమణ కాలనీలోని విజ్ఞాన్ భారతి హైస్కూల్‌లో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మల్లాపూర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి పాల్గొని బిల్వపత్రం, ఉసిరి, జమ్మి మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని పిలుపునిచ్చారు. పచ్చదనం పెంపొందించడం ద్వారా భావితరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రీన్ ఇండియా ఛాలెంజ్ సభ్యుడు నారాయణ, పాఠశాల కరస్పాండెంట్ బుచ్చిరెడ్డి, బీఆర్ఎస్ నాయకులు తాండ వాసు గౌడ్, వెంకటరమణ కాలనీ అధ్యక్షుడు రాపోలు సతీష్ తదితరులు పాల్గొన్నారు.



మునుగోడులో 3630 మందికి నూతన చేయూత
పెన్షన్ల మంజూరి పత్రాల పంపిణీ

- మూడేళ్ల పరిపాలన తర్వాత తెలంగాణ ప్రజలు సంతోషంగా లేరు
- మునుగోడు అభివృద్ధికి నిధులు ఆపితే,మరో కురుక్షేత్రం అవుతుంది
- తండ్రి పాత్ర పోషించాల్సిన ముఖ్యమంత్రి వివక్ష చూపొద్దు
- నేను ప్రజల సొమ్మును కాపాడే మనిషిని,తినే మనిషిని కాదు
- మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి కామెంట్స్



చౌటుప్పల్, విశాలభారతి:

మునుగోడు నియోజకవర్గ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఆవరణలో జరిగిన నూతన చేయూత పెన్షన్ల మంజూరి పత్రాల పంపిణీ కార్యక్రమంలో గౌరవ మునుగోడు శాసనసభ్యులు శ్రీ కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అధికారులతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి, తెలంగాణ రాష్ట్ర గీతం జయ జయహే తెలంగాణ ఆలపించిన అనంతరం కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మునుగోడు నియోజకవర్గంలోని నల్గొండ జిల్లా పరిధిలోని మునుగోడు, గట్టుప్పల్, మర్రిగూడ, నాంపల్లి, చండూరు మండలాలతో పాటు చండూరు మున్సిపాలిటీలో చేయూత పెన్షన్ కి ఎంపికైన 3630 మంది లబ్ధిదారులకు పెన్షన్ మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. మునుగోడు మండలంలోని 28 గ్రామాలకు చెందిన 845 మంది, చండూరు మండలంలోని 19 గ్రామాలకు చెందిన 530 మంది, చండూరు మున్సిపాలిటీలోని 10 వార్డులకు చెందిన 293 మంది, మర్రిగూడ మండలంలోని 18 గ్రామాలకు చెందిన 785 మంది, నాంపల్లి మండలంలోని 32 గ్రామాలకు చెందిన 651 మంది లబ్ధిదారులు చేయూత పెన్షన్ మంజూరి పత్రాలను అందుకున్నారు. పెన్షన్ అందుకున్న వారిలో ఒంటరి మహిళలు, వితంతువులు, వికలాంగులు, గీత కార్మికులు, చేనేత కార్మికులు ఉన్నారు. కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మాట్లాడుతూ.. నూతనంగా పెన్షన్ అందుకుంటున్న వితంతువులు, వికలాంగులు, ఒంటరి మహిళలు, చేనేత కార్మికులు, గీత కార్మికులకు అభినందనలు తెలిపారు. ఎన్నో ఏండ్లుగా ఎదురుచూస్తున్న తరుణం ఇదని, అప్లై చేసుకున్న వారిలో నూటికి 90 శాతం మందికి వచ్చాయని అన్నారు. పెన్షన్ల మంజూరు విషయంలో మేము జోక్యం చేసుకోలేదని, రాజకీయ జోక్యం లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికి అందాలనేది మా ప్రభుత్వ ఉద్దేశమని అన్నారు. ప్రభుత్వ సొమ్ము పేదవాళ్లకు చెందాలని, అనర్హులకు వెళ్లొద్దని అన్నారు. గతంలో అసెంబ్లీలో చెప్పానని, రైతుబంధు అనేది నిజంగా వ్యవసాయం చేసే వాళ్ళకి ఇవ్వాలని అన్నారు. ప్రభుత్వ సొమ్ము పేద ప్రజలకు,పేద రైతులకు చెందాలి,ఉన్న వాళ్లకు వద్దనేది నా ఉద్దేశమని తెలిపారు. ప్రభుత్వానికి సూచన చేస్తున్నానని, గతంలో బీఆర్ఎస్ చేసిన తప్పులు మనం చేయొద్దనేది నా అభిప్రాయమని అన్నారు. ఉన్నది ఉన్నట్టుగా మాట్లాడడం నా నైజమని, ఇలా మాట్లాడితే మంత్రి పదవి రాలేదని ప్రచారం చేస్తున్నారని అన్నారు. ప్రజల కోసం, ప్రజల మంచి కోసం మాత్రమే మాట్లాడతానని అన్నారు. అభివృద్ధి, సంక్షేమం అనేవి ప్రభుత్వానికి రెండు కండ్లని, గత ప్రభుత్వం అభివృద్ధి పేరు మీద అప్పుచేసి కాంట్రాక్టర్లకు కట్టబెట్టి అవినీతి చేసిపోయిందని, ఇప్పుడు అప్పు కట్టలేక ఈ ప్రభుత్వం ఇబ్బంది పడుతోందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అంటేనే పేదల కోసం పుట్టిన పార్టీ అని, దేశం కోసం ప్రాణాలు అర్పించిన ఇందిరా గాంధీ ఆశయాలు, రాజీవ్ గాంధీ ఆశయాలు నెరవేర్చడమే మా ప్రభుత్వ ఉద్దేశ్యమని అన్నారు.గత ప్రభుత్వం చేసిన అవినీతిని బయటికి తీసి ప్రజాధనాన్ని రికవరీ చేసి వారిని జైల్లో పెట్టాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం అవలంబించిన విధానాన్ని మనము అవలంబిస్తే అభివృద్ధి, సంక్షేమం చేయలేమని అన్నారు. కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో 4000 రూపాయలు పెన్షన్ ఇస్తామని చెప్పామని, మాట నిలబెట్టుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వం పైన ఉందని అన్నారు. ఒకసారి మాట ఇస్తే మాట తప్పము, మడమ తిప్పమనేది వైయస్సార్ అనాడు అన్నారని, ఎందుకు చేయలేకపోతున్నామో ప్రజలకు చెప్పాల్సిన బాధ్యత ప్రభుత్వం పైన ఉందని అన్నారు. మునుగోడులో జరిగే రోడ్ అభివృద్ధి పనులు ఆరు నెలలు చేసి నిధులు రాక కాంట్రాక్టర్లు వెళ్ళిపోతున్నారని అన్నారు.ప్రజలకు ప్రభుత్వం మీద నమ్మకం ఏర్పడే విధంగా ప్రభుత్వం పనిచేయాలని మునుగోడు నియోజకవర్గ ప్రజల తరపున విజ్ఞప్తి చేస్తున్నానని తెలిపారు. పదవుల్లో ఉండేవాళ్లు బాధ్యతగా ప్రవర్తించాలని,ప్రజా జీవితంలో ఉన్న వాళ్ళు నిజాయితీగా పనిచేసినప్పుడే ప్రజలకు న్యాయం జరుగుతుందని అన్నారు. పెన్షన్ 2000 కాదు 5000 ఇచ్చినా తప్పులేదని, ప్రతి మండల కేంద్రంలో ఓల్డేజ్ హోం పెట్టాలని అన్నారు. గత ప్రభుత్వంలో ఉండి అవినీతి చేసిన కాంట్రాక్టర్లు ఇప్పుడు ఈ ప్రభుత్వంలో ఉన్నారని, అదే దోపిడీ కొనసాగుతోందని, ఆంధ్ర కాంట్రాక్టర్లు, ఆంధ్ర పెట్టుబిదారులదే నడుస్తోందని అన్నారు. పేదల కోసం ఎక్కడైతే అన్యాయం జరుగుతుందో అక్కడ కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఉంటారని అన్నారు. నేను రాజకీయాలకి వచ్చింది పేదల కోసమని, భగవంతుడు దయవల్ల నా కుటుంబం బాగానే ఉందని, నేను పదవుల కోసం పాకులాడబోదని అన్నారు. మూడేళ్ల పరిపాలన తర్వాత తెలంగాణ ప్రజలు సంతోషంగా లేరనితెలిపారు. మా నియోజకవర్గానికి అభివృద్ధికి నిధులు ఇచ్చి సహకరించండని కోరారు. మునుగోడు ప్రజలు ఆత్మగౌరవం ఉన్న,దమ్మున్న లీడర్ ని గెలిపించారని, కానీ అడుక్కు తినే లీడర్ ని గెలిపించలేదని అన్నారు. ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి ని అడుగుతున్నానని, తెలంగాణ రాష్ట్రం అంటే కొడంగల్, మధిర నియోజకవర్గాలే కాదని అన్నారు. కొడంగల్ కి 10000 కాకపోతే 20 వేల కోట్లు తీసుకెళ్ళు, మాకు అభ్యంతరం లేదని, కాంగ్రెస్ సీనియర్ ఎమ్మెల్యే అడుగుతున్నప్పుడు అభివృద్ధికి నిధులు ఇవ్వాలని, కానీ పండబెట్టి తొక్కుతా అని అనడం భావ్యం కాదని అన్నారు.

తండ్రి పాత్ర పోషించాల్సిన ముఖ్యమంత్రి వివక్ష చూపొద్దని* అన్నారు.

నేను కాంగ్రెస్ పార్టీ, రాహుల్ గాంధీ మనిషినేనని, కానీ మునుగోడు నియోజకవర్గం అభివృద్ధి నిధులు కావాలని అయ్యప్ప దీక్షలో కోరుతున్నానని అన్నారు. *రాహుల్ గాంధీ ప్రధానమంత్రి కావాలని, కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్రంలో మళ్లీ అధికారంలోకి రావాలనేదే మా కోరికని వారు అన్నారు. మునుగోడు అభివృద్ధికి నిధులు ఆపితే మరో కురుక్షేత్రం అవుతుందని గుర్తుపెట్టుకోండని హెచ్చరించారు. నేను ప్రజల సొమ్మును కాపాడే మనిషిని, తినే మనిషిని కాదని అన్నారు.

భారత్ వికాస్ పరిషత్ ఆధ్వర్యంలో ఘనంగా 'భారత్ కో జానో' క్విజ్ పోటీలు

- 14 పాఠశాలల నుంచి 863 మంది విద్యార్థుల ఉత్సాహభరిత పాల్గొనడం.. విజేతలకు అభినందనలు

రాజేంద్రనగర్, విశాల భారతి :

విద్యార్థుల్లో భారతదేశ చరిత్ర, సంస్కృతి, సంప్రదాయాలు, జాతీయ సమైక్యత, దేశభక్తి భావాలను పెంపొందించడమే లక్ష్యంగా భారత్ వికాస్ పరిషత్ ఆధ్వర్యంలో మణికొండ జిజియాబాయి శాఖ నేతృత్వంలో బుధవారం 'భారత్ కో జానో' క్విజ్ పోటీలను ఘనంగా నిర్వహించారు. ఈ పోటీల్లో సుమారు 14 పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారు. ప్రాథమిక స్థాయి పోటీల్లో జూనియర్స్ విభాగం నుంచి 547 మంది, సీనియర్స్ విభాగం నుంచి 316 మంది విద్యార్థులు పాల్గొన్నారు. మొత్తం 863 మంది విద్యార్థులు ఈ పోటీల్లో తమ విజ్ఞానాన్ని ప్రదర్శించారు. ప్రతిభ ఆధారంగా జూనియర్స్ విభాగంలో ప్రథమ స్థానానికి 10 మంది, ద్వితీయ స్థానానికి 14 మంది, సీనియర్స్ విభాగంలో ప్రథమ స్థానానికి 10 మంది, ద్వితీయ స్థానానికి 12 మంది విద్యార్థులను తుది స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఎంపికైన విద్యార్థులతో నిర్వహించిన తుది స్థాయి పోటీల్లో సుమారు 55 మంది విద్యార్థులు పాల్గొని వివిధ అంశాలపై తమ పరిజ్ఞానాన్ని ప్రదర్శించారు. ఈ పోటీల్లో జూనియర్స్ విభాగంలో ఎస్.వై.వి.ఆర్. ఎక్స్ సీడీ స్కూల్ ప్రథమ స్థానాన్ని, నాగార్జున హైస్కూల్, రాయదుర్గం ద్వితీయ స్థానాన్ని కైవసం చేసుకున్నాయి. సీనియర్స్ విభాగంలో నాగార్జున హైస్కూల్, రాయదుర్గం ప్రథమ స్థానంలో నిలవగా, గౌతమి టాలెంట్ హైస్కూల్ ద్వితీయ స్థానాన్ని సాధించింది. విజేతలుగా నిలిచిన పాఠశాలల విద్యార్థులను నిర్వాహకులు అభినందించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. ఇలాంటి విజ్ఞాన పోటీలు విద్యార్థుల్లో ఆలోచనా శక్తిని, సాధారణ పరిజ్ఞానాన్ని పెంపొందించడంతో పాటు భారతదేశ చరిత్ర, సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన కల్పిస్తాయని పేర్కొన్నారు. ముఖ్యంగా యువతలో జాతీయ సమైక్యత, దేశభక్తి భావాలను బలోపేతం చేసేందుకు 'భారత్ కో జానో' వంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. భవిష్యత్తులోనూ విద్యార్థుల మేధో వికాసానికి, జాతీయ భావాల పెంపునకు దోహదపడే కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహిస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో భారత్ వికాస్ పరిషత్ మణికొండ జిజియాబాయి శాఖ అధ్యక్షులు పెంటా రెడ్డి, ప్రధాన కార్యదర్శి మల్లేష్, ఉపాధ్యక్షులు జగన్నాథ్, ఆర్థిక కార్యదర్శి శ్రీనివాస్, నిర్వహణ కార్యదర్శి పి.బి. సతీష్, ముఖ్య సంరక్షకులు రాజశేఖర్, ముఖ్య సలహాదారు సతీష్ కుమార్, సలహాదారు అందె లక్ష్మణ్ రావు, ప్రభుజి, రామచంద్ర, వెంకటేశ్వర్లు, బుచ్చయ్య, రామానుజం తదితరులు పాల్గొన్నారు.



డంపింగ్ యార్డుతో యాచారం మండలాన్ని నాశనం చేయొద్దు

- రైతులు కూరగాయల సాగు పైనే ఆధారపడి జీవనం
- ప్రజల ఆరోగ్యం రైతుల జీవనోపాధిని దృష్టిలో ఉంచుకోవాలి
- ప్రజల పక్షాన పోరాటం చేస్తాం.
- ఎన్ఎన్ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు నాయిని నవీన్ రెడ్డి

విశాల భారతి ఇబ్రహీంపట్నం

యాచారం గ్రామంలో ప్రతిపాదించిన శ్రీ వెంకటేశ్వర పవర్ ప్రాజెక్టును తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని ఎన్ఎన్ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు నాయిని నవీన్ రెడ్డి అన్నారు. బుధవారం పత్రికా ప్రకటనలో ఆయన మాట్లాడుతూ యాచారం గ్రామంలోని సర్వే నంబర్లు 105 నుంచి 125 వరకు సుమారు 25 ఎకరాల్లో ప్రజల ఆమోదం లేకుండా డంపింగ్ యార్డు ఏర్పాటుకు ఎలా అనుమతులు ఇస్తారని ప్రశ్నించారు. యాచారం, మొండి గౌరెల్లి, గడ్డం మల్లయ్యగూడ, గున్‌గల్, దాత్‌పల్లి, నల్లవెల్లి, వెంకటేశ్వర తండా గ్రామాల రైతులు కూరగాయల సాగుపైనే ఆధారపడి జీవిస్తున్నారని పేర్కొన్నారు. హైదరాబాద్ నుంచి రోజుకు వందలాది లారీల ద్వారా భారీగా చెత్తను తరలించి డంపింగ్ యార్డు ఏర్పాటు చేస్తే ఈ ప్రాంతమంతా కాలుష్య కోరల్లో చిక్కుకునే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజల ఆరోగ్యం, రైతుల జీవనోపాధిని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం వెంటనే డంపింగ్ యార్డు ప్రతిపాదనను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఈ ప్రాజెక్టుకు వ్యతిరేకంగా ప్రజల పక్షాన నిలబడి పోరాటం చేస్తామని హెచ్చరించారు.

ఘనంగా మండల పూజ మహోత్సవములు

- నగర సంకీర్తన లో కన్నెస్వాములు,దీక్ష తీసుకున్న స్వాములు
- అధిక సంఖ్యలో స్వాములు,భక్తులు,పుర ప్రజలు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించి విజయవంతం చేయండి
- ప్రెస్ మీట్‌లో వివరాలను వెల్లడించిన శ్రీ స్వామి అయ్యప్ప వెల్ఫేర్ ట్రస్ట్ సభ్యులు



పాల్వంచ విశాలభారతి: తెలంగాణ రాష్ట్రంలో ఎంతో ప్రసిద్ధి చెందిన ఆలయంగా గుర్తింపు పొందిన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ అయ్యప్ప నగర్ లో వెలసిన శ్రీ స్వామి అయ్యప్ప దేవస్థానంలో ఈ నెల 28 న ఎంతో ప్రతిష్టాత్మకంగా మండల పూజ మహోత్సవములు నిర్వహిస్తున్నామని స్వాములు,భక్తులు,పుర ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించి, విజయవంతం చేయాలని శ్రీ స్వామి అయ్యప్ప దేవస్థానం శ్రీ స్వామి అయ్యప్ప వెల్ఫేర్ ట్రస్ట్ సభ్యులు తెలియచేసారు.బుధవారం ట్రస్ట్ సభ్యులు ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్ లొ వివరాలను వెల్లడించారు.ఈ సందర్భంగా ట్రస్ట్ సభ్యులు మాట్లాడుతూ గత 40 సంత్సరాలుగా ఎందరో స్వాములకు మాలా ధారణ గావించి విశేష స్వాములను అందించిన పాల్వంచ అయ్యప్ప దేవస్థానం లో ఈ నెల 28 న శనివారం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మండల పూజ మహోత్సవములు నిర్వహిస్తున్నామని,ఆ రోజు ఉదయం 4 గంటలకు గణపతి హోమం,5 గంటల నుండి 8:30 వరకు అభిషేకం,ఉషపూజ,మాలా ధారణ కార్యక్రమం ఉంటుందని 8:30 నుండి 11:30 వరకు బలిపీఠ పూజ అనంతరం అన్న ప్రసాద వితరణ గలదని తెలిపారు.సాయంత్రం 4 గంటల నుండి బొల్లోరుగూడెం రామాలయం నుండి మాలా ధారణ చేసిన స్వాములచే అంగరంగవైభవంగా కేరళ వాయిద్యాల నడుమ కన్నె జ్యోతులతో నగర సంకీర్తన,డప్పు వాయిద్యాలతో కోలాట నృత్యాల నడుమ పాల్వంచ పుర వీధుల మీదుగా వేలాది మంది స్వాములతో స్వామి వారి ఊరేగింపు ఆలయానికి చేరుకుంటుదని తెలిపారు.రాత్రి 8:30 ల నుండి దీక్ష పొందిన అయ్యప్ప లచే నిప్పుల్లో నడక వుంటుందని వివరించారు.రాత్రి 9:30 ల నుండి స్వామి వారికి పుష్పాభిషేకం,తదనంతరం తీర్థ ప్రసాద వినియోగం,స్వాములకు,భక్తులకు అల్పాహారం అందిస్తామని వెల్లడించారు.పుర వీధుల్లో కన్నె స్వాములు దీక్ష తీసుకున్న స్వాములచే కన్నెజ్యోతులతో నగర సంకీర్తన లో అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి కృపకు పాత్రులు కావాలని విజ్ఞప్తి చేసారు.ఈ ప్రెస్ మీట్ లో శ్రీ స్వామి అయ్యప్ప దేవస్థాన ప్రధాన అర్చకులు నంబూద్రి అయ్యగారు,శ్రీ స్వామి అయ్యప్ప వెల్ఫేర్ ట్రస్ట్ సభ్యులు కొత్వాల శ్రీనివాసరావు,మేడిద సంతోష్ గౌడ్,బండెల శ్రీనివాసరావు,కనగాల రాంబాబు,కాల్వ భాస్కర్ రావు,నరహరి,బేతంశెట్టి వెంట్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన లబ్ధిదారులకు ఆసరా పింఛన్ పత్రాలు

- పంపిణీ చేసిన గ్రామసర్పంచ్ మండవ వెంకటాద్రి



మునగాల: విశాలభారతి: మండలపరిధిలోని కలకోవ గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో తెలంగాణరాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలులో భాగంగా అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాన్ని చేయూత పెన్షన్ పత్రాలను మంగళవారం పంపిణీ చేశారు.గ్రామ సర్పంచ్ మండవ వెంకటాద్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈకార్యక్రమంలో కల్లుగీత కార్మికులు, దివ్యాంగులు, వితంతువులు తదితర అర్హులైన లబ్ధిదారులకు పథకం పత్రాలను అందజేశారు. ఈసందర్భంగా సర్పంచ్ మండవ వెంకటాద్రిమాట్లాడుతూ,గ్రామంలోని అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తామని తెలిపారు. గ్రామప్రజల అవసరాలను గుర్తిస్తూ గ్రామ అభివృద్ధికి నిరంతరం కృషి చేయడమే తనప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పిస్తూ, ఎలాంటి ఇబ్బందులు లేకుండా పథకాల ప్రయోజనాలు అందేలా సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుంటామని అన్నారు.గ్రామంలో మౌలిక సదుపాయాల కల్పన, పారిశుద్ధ్యనిర్వహణ, తాగునీటి సమస్యల పరిష్కారం, వీధి దీపాల ఏర్పాటు, అంతర్గత రహదారుల అభివృద్ధితో పాటు ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. గ్రామ ప్రజల సహకారంతో కలకోవ గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు కృషిచేస్తానని చెప్పారు.ప్రభుత్వ సంక్షేమ పథకాలు సమాజంలోని అట్టడుగు వర్గాలకు చేరినప్పుడే వాటి లక్ష్యం నెరవేరుతుందని, ముఖ్యంగా కల్లుగీత కార్మికులు, దివ్యాంగులు, వ

లంచం వసూళ్లలో సర్పంచ్ బాగోతం బట్టబయలు

- రూ.30 లక్షల డిమాండ్
- రూ.13 లక్షలకు బేరం
- రూ.2 లక్షలు తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన వైనం
- మోదుగడ్డ తండా సర్పంచ్ ధరావత్ వీరును రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్న వరంగల్ ఏసీబీ అధికారులు

మహబూబాబాద్ జిల్లా విశాల భారతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్.



ప్రజలకు సేవ చేయాల్సిన గ్రామ పంచాయతీ సర్పంచ్‌పై భారీ లంచం డిమాండ్ ఆరోపణలు వెల్లువెత్తాయి. క్వారీల కార్యకలాపాలకు ఎలాంటి ఆటంకాలు లేకుండా చూడటంతో పాటు గ్రానైట్ వ్యాపారం సజావుగా సాగేందుకు సహకరిస్తానంటూ ఏకంగా రూ.30 లక్షలు డిమాండ్ చేసినట్లు ఏసీబీ వెల్లడించింది. చివరకు రూ.13 లక్షలకు బేరం కుదుర్చుకుని, అందులో మొదటి విడతగా రూ.2 లక్షలు స్వీకరిస్తుండగా అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారుల వలకు చిక్కాడు. మహబూబాబాద్ జిల్లా సీరోల్ మండలం మోదుగడ్డ తండా సర్పంచ్ ధరావత్ వీరును వరంగల్ ఏసీబీ బృందం ఖమ్మంలో రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకోవడం జిల్లావ్యాప్తంగా చర్చనీయాంశమైంది.

రూ.30 లక్షలతో లంచం బేరం ప్రారంభం

ఏసీబీ తెలిపిన వివరాల ప్రకారం.. మెసర్స్ శారదా స్టోనెక్స్, మెసర్స్ ప్రీమియర్ గ్రానైట్స్, మెసర్స్ రాశి గ్రానైట్స్ సంస్థలకు చెందిన క్వారీ కార్యకలాపాలకు అంతరాయం కలగకుండా చూడటం, గ్రానైట్ వ్యాపారం సజావుగా కొనసాగేందుకు అధికారిక సహకారం అందించడం పేరుతో సర్పంచ్ లంచం డిమాండ్ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. తొలుత రూ.30 లక్షలు అడిగి, అనంతరం రూ.13 లక్షలకు తగ్గించినట్లు ఏసీబీ పేర్కొంది.

లంచం సొమ్ము చేతికి అందగానే ఏసీబీ దాడి!

ఒప్పందంలో భాగంగా మొదటి విడతగా రూ.2 లక్షలు తీసుకునేందుకు ఖమ్మంలోని ఫిర్యాదుదారుడి కార్యాలయానికి వెళ్లిన సమయంలో వరంగల్ ఏసీబీ అధికారులు పక్కా వ్యూహంతో ట్రాప్ నిర్వహించారు. నగదు స్వీకరిస్తుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుని రూ.2 లక్షల లంచం సొమ్మును స్వాధీనం చేసుకున్నారు. అధికారిక హోదాను దుర్వినియోగం చేసి అక్రమ లబ్ధి పొందేందుకు ప్రయత్నించినట్లు ఏసీబీ వెల్లడించింది.

వరంగల్ ప్రత్యేక కోర్టుకు తరలింపు.

నిందితుడు ధరావత్ వీరును అరెస్టు చేసి వరంగల్‌లోని ఎస్‌పీఈ, ఏసీబీ కేసుల ప్రత్యేక న్యాయస్థానంలో హాజరుపరిచి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించనున్నట్లు అధికారులు తెలిపారు. కేసు ప్రస్తుతం దర్యాప్తులో ఉంది. ఫిర్యాదుదారుడి భద్రతను దృష్టిలో ఉంచుకుని వారి వివరాలను గోప్యంగా ఉంచారు.

లంచం అడిగితే ఏసీబీకి సమాచారం ఇవ్వండి.

ప్రభుత్వ ఉద్యోగులు ఎవరైనా లంచం డిమాండ్ చేస్తే ప్రజలు భయపడకుండా ఏసీబీ టోల్‌ఫ్రీ నంబర్ 1064కు ఫిర్యాదు చేయాలని అధికారులు కోరారు. వాట్సాప్ నంబర్ 9440446106 ద్వారా కూడా సమాచారం అందించవచ్చని తెలిపారు. ఫిర్యాదుదారుల వివరాలను గోప్యంగా ఉంచుతామని స్పష్టం చేశారు.

ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా

- ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకానికి తెలంగాణ ప్రభుత్వం శ్రీకారం
- అర్హులైన ప్రతి కుటుంబానికి ఆర్థిక భరోసా.. రూ.5 లక్షల జీవిత బీమా సౌకర్యం
- వివరాల కోసం గ్రామ పంచాయతీ కార్యాలయాలను సంప్రదించాలి
- మండల ప్రజలకు ఎంపీడీవో శ్రీవాణి సూచన



విశాల భారతి, అబ్దుల్లాపూర్‌మెట్ : రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించడమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని ప్రవేశపెడుతోందని అబ్దుల్లాపూర్‌మెట్ మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీవో) శ్రీవాణి తెలిపారు. ఈ పథకం ద్వారా అర్హులైన కుటుంబాలకు రూ.5 లక్షల జీవిత బీమా సౌకర్యం కల్పించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎంపీడీవో శ్రీవాణి మాట్లాడుతూ.. మండల పరిధిలోని ప్రజలందరూ ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకంపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. పథకానికి సంబంధించిన అర్హతలు, ఇతర పూర్తి వివరాల కోసం తమ సమీపంలోని గ్రామ పంచాయతీ కార్యాలయాలను సంప్రదించాలని కోరారు. ప్రభుత్వం అందిస్తున్న ఈ బీమా సౌకర్యాన్ని అర్హులైన కుటుంబాలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

అయ్యప్ప మహా పడిపూజలో మొద్దు లచ్చి రెడ్డి

- ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి ఆశీస్సులు పొందిన మాజీ కార్పొరేటర్



విశాల భారతి, ఎల్బీనగర్ : బ్రాహ్మణపల్లిలోని ఆర్‌బీఆర్ హోమ్స్‌లో గజవెల్లి గౌతమ్ గుప్తా (గురుస్వామి) ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించిన శ్రీశ్రీశ్రీ అయ్యప్ప స్వామి మహా పడిపూజ మహోత్సవంలో బీఎన్ రెడ్డి నగర్ డివిజన్ తాజా మాజీ కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా మొద్దు లచ్చి రెడ్డి మాట్లాడుతూ.. అయ్యప్ప స్వామివారి కృపాకటాక్షాలతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలు భక్తిభావాన్ని, ఆధ్యాత్మిక చింతనను పెంపొందిస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ డివిజన్ ప్రధాన కార్యదర్శి విష్ణువర్ధన్ రెడ్డి, బీజేవైఎం అధ్యక్షులు సురేష్ కుమార్, నాయకులు పెరుమాళ్ రెడ్డి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

గుడిసెలో నివసించే వారికి ఇందిరమ్మ ఇండ్ల ప్రొసీడింగ్ ఆర్డర్లు అందజేత

- చైర్ పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్



చౌటుప్పల్,విశాల భారతి: మున్సిపల్ కార్యాలయంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ ప్రొసీడింగ్ ఆర్డర్లను చైర్ పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్ చేతుల మీదుగా 46 మంది లబ్ధిదారులకు పంపిణీ చేయడం జరిగింది. వీరిలో 4 మంది గుడిసెలలో నివసించే లబ్ధిదారులు ఉన్నారు.

ఈ సందర్భంగా చైర్ పర్సన్ మాట్లాడుతూ...

పట్టణంలోని అన్ని వార్డుల్లో నివసించే నిరుపేద కుటుంబాలకు,శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సహకారంతో అర్హులైన ప్రతి ఒక్క కుటుంబానికి పక్కా ఇల్లు కట్టుకునే అదృష్టం కలిగిందని అన్నారు. పట్టణంలో పేదలందరికీ నిష్పక్షపాతంగా, పారదర్శకంగా, రాజకీయాలకు అతీతంగా ప్రభుత్వపరంగా అందే ప్రతి ఒక్క సంక్షేమ పథకాన్ని ప్రజలకు అందజేయడమే తన లక్ష్యమని తెలిపారు.ప్రతి కౌన్సిలర్, కోఆప్షన్ సభ్యుల సహకారంతో పేద ప్రజల కష్టాలను తీర్చడంతో పాటు, పట్టణాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎన్. వెంకటేశ్వర నాయక్, వైస్ చైర్మన్ గోశిక వినయ్ కుమార్, కౌన్సిలర్లు పూదరి యాదయ్య, కొయ్యడ శేఖర్, పాక చిరంజీవి, బద్రి గాలయ్య, చింతల ఉమామహేశ్వరి సాయిలు, పిల్లలమర్రి మధుసూదన్, హన్ను మహమ్మద్, నాయకులు సురేందర్ రెడ్డి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు కాసర్ల శ్రీనివాస్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ కొయ్యడ సైదులు, దేప రాజు, బత్తుల విప్లవ కుమార్, ఉడుగు రమేష్, గడ్డం రాజరత్నం మరియు మున్సిపల్ మేనేజర్ శ్రీధర్ రెడ్డి, ఆర్పో అంజయ్య, సీనియర్ అసిస్టెంట్ దీప, సానిటరీ ఇన్స్పెక్టర్ హనుమాన్ ప్రసాద్, హౌసింగ్ ఏఈ కళ్యాణి, వార్డ్ ఆఫీసర్లు, బిల్ కలెక్టర్లు మరియు లబ్ధిదారులు పెద్ద ఎత్తున పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

పేద కుటుంబాలకు రూ. 5 లక్షల ఆర్థిక భరోసా

- నేటి నుంచే 'ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా' పథకం షురూ.
- ఇబ్రహీంపట్నం మండలంలోని గ్రామ పంచాయతీల్లో ప్రత్యేక శిబిరాలు



విశాల భారతి ఇబ్రహీంపట్నం: పేద కుటుంబాలకు ఆపద సమయంలో అండగా నిలిచేందుకు తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెడుతున్న "ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా" పథకం ఇబ్రహీంపట్నం మండలంలో నేటి నుంచి అమలులోకి రానుందని ఇబ్రహీంపట్నం ఎంపిడీఓ ప్రమీల నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. మాజీ ప్రధాని ఇందిరా గాంధీ జయంతిని పురస్కరించుకుని నేటి నుంచి ఈ పథకాన్ని అధికారికంగా ప్రారంభించనున్నారు. ఈ పథకం ద్వారా అర్హులైన ప్రతి కుటుంబానికి రూ. 5 లక్షల వరకు జీవిత బీమా సదుపాయం లభించనుంది. గ్రామీణ ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరిగే ఇబ్బంది లేకుండా, మండలంలోని అన్ని గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో ప్రత్యేక నమోదు శిబిరాలను ఏర్పాటు చేస్తున్నారు. ఈ శిబిరాల్లో 18 నుంచి 59 సంవత్సరాల వయస్సు గల కుటుంబ పెద్ద (కుటుంబాన్ని పోషించే వ్యక్తి) వివరాలను నమోదు చేస్తారు. దరఖాస్తుల స్వీకరణతో పాటు, ఆధార్ ఆధారిత వయస్సు ధృవీకరణ, ఆన్‌లైన్ డేటా ఎంట్రీ ప్రక్రియను అధికారులు పూర్తి చేయనున్నారు. కావున, మండలంలోని అర్హులైన ప్రతి ఒక్కరూ ఆధార్ కార్డు తదితర అవసరమైన పత్రాలతో గ్రామ పంచాయతీ శిబిరాలకు హాజరై, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ కుమారుడి వివాహానికి సీఎం రేవంత్ రెడ్డికి ఆహ్వానం



రాజేంద్రనగర్, విశాల భారతి : రాజేంద్రనగర్ నియోజకవర్గ శాసనసభ్యుడు టి. ప్రకాష్ గౌడ్ తన కుమారుడు సంతోష్ గౌడ్ వివాహ వేడుకకు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డిని సాదరంగా ఆహ్వానించారు. ఈ నెల 22వ తేదీన జరగనున్న సంతోష్ గౌడ్ వివాహ వేడుకను పురస్కరించుకుని ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వివాహ ఆహ్వాన పత్రికను ముఖ్యమంత్రికి అందజేసి, వివాహ వేడుకకు విచ్చేసి నూతన వధూవరులను ఆశీర్వదించాలని కోరారు. కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు,శ్రేయోభిలాషుల సమక్షంలో వివాహ వేడుకను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిసింది.తన కుమారుడి వివాహ వేడుకకు ముఖ్యమంత్రిని స్వయంగా కలిసి ఆహ్వానించడం ద్వారా ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ఈ శుభకార్యానికి ప్రత్యేక ప్రాధాన్యతనిచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఆహ్వాన పత్రిక అందజేసిన సందర్భంగా ఇరువురి మధ్య మర్యాదపూర్వకంగా సమావేశం జరిగింది.

ఎండిన చెట్టు కూలి సాఫ్ట్‌వేర్ ఉద్యోగి దుర్మరణం

- ఇందు ఆరణ్య సమీపంలో విషాదం.. నెల రోజుల క్రితమే వివాహం



విశాల భారతి, ఎల్బీనగర్ : రోడ్డు పక్కన ఉన్న ఎండిపోయిన చెట్టు అకస్మాత్తుగా కూలిపడటంతో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి అక్కడికక్కడే మృతి చెందిన విషాద ఘటన నాగోల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. నెల రోజుల క్రితమే వివాహమైన యువకుడు మృత్యువాత పడటంతో కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది. నాగోల్ ఇన్‌స్పెక్టర్ మొహమ్మద్ మక్బూల్ జానీ తెలిపిన వివరాల ప్రకారం.. రాజోలు ప్రాంతానికి చెందిన వి. సాయికుమార్ (29) ఇందు అరణ్యలోని శ్రీ వెంకటేశ్వర కాలనీలో నివాసముంటున్నాడు. గత ఐదేళ్లుగా ఇన్ఫోసిస్ సంస్థలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. బుధవారం సాయంత్రం సుమారు 4 గంటల సమయంలో గ్యాస్ బుక్ చేసేందుకు ఇందు అరణ్య నుంచి గౌరెల్లి వైపు వెళ్తుండగా, కుంట్లూర్ పరిధిలోని డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల సమీపంలో రోడ్డు పక్కన ఉన్న ఎండిపోయిన చెట్టు ఒక్కసారిగా అతనిపై కూలిపడింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన సాయికుమార్ అక్కడికక్కడే మృతి చెందాడు.

నెల రోజుల క్రితమే వివాహం.. కుటుంబంలో విషాదం

ఈ ప్రమాదంలో సాయికుమార్ బాబాయి పి. రాధాకృష్ణ (48) కూడా గాయపడినట్లు పోలీసులు తెలిపారు. అప్పటివరకు సంతోషంగా సాగిన కుటుంబంలో ఈ ఘటన తీవ్ర విషాదాన్ని నింపింది. నెల రోజుల క్రితమే వివాహం చేసుకున్న సాయికుమార్ ఆకస్మిక మృతితో కుటుంబ సభ్యులు, బంధువులు శోకసంద్రంలో మునిగిపోయారు. ఘటనకు సంబంధించి పోలీసులు తదుపరి వివరాలు సేకరిస్తున్నారు.

నికార్సైన కమ్యూనిస్టు చింతల భూపాల్ రెడ్డి

- చింతల భూపాల్ రెడ్డి జీవితం పేద ప్రజలకు అంకితం, జాన్ వెస్లీ

చౌటుప్పల్,విశాల భారతి:



భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) యాదాద్రి భువనగిరి జిల్లా మాజీ కార్యదర్శి వర్గ సభ్యులు, అమరజీవి కామ్రేడ్ చింతల భూపాల్ రెడ్డి స్తూపావిష్కరణ, ప్రథమ వర్ధంతి సభ బుధవారం రోజున చౌటుప్పల్ మున్సిపాలిటీలోని తంగడిపెల్లి రోడ్డులో గల నాగులకుంట వద్ద ఘనంగా జరిగింది. మొదటగా మాజీ కేంద్ర కమిటీ సభ్యులు, మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు జెండా ఆవిష్కరణ చేశారు. అనంతరం ముఖ్యఅతిథి సీపీఎం పార్టీ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ స్తూపాన్ని ఆవిష్కరించారు. సీపీఎం పార్టీ చౌటుప్పల్ మున్సిపల్ కార్యదర్శి గోశిక కరుణాకర్ అధ్యక్షతన నిర్వహించిన వర్ధంతి సభలో జాన్ వెస్లీ మాట్లాడుతూ... కందాల రంగారెడ్డి నాయకత్వంలో పని చేసి, కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాణానికి అహర్నిశలు కృషి చేసి, ఎంతోమందిని ఉద్యమ నిర్మాణానికి తయారుచేశారని అన్నారు.చౌటుప్పల్ లో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు కై, 100 పడకల ఆసుపత్రి నిర్మాణానికై, చౌటుప్పల్ ప్రాంతంలోని ఫ్లోరైడ్ పీడిత సమస్యపై త్రాగునీటికై కృష్ణా జలాలు, సాగునీరు లేక ఈ ప్రాంత రైతులు అవస్థలు పడుతుంటే తెప్పలచెరువు నుండి మల్కాపురం, కైతాపురం, ధర్మోజిగూడెం, లక్కారం చెరువులోకి నీళ్లను కాలువ ద్వారా నింపడం, మూసి పిలాయిపల్లి కాలువ సాధనకై ప్రజలను, రైతులను పెద్ద ఎత్తున సమీకరించి సాధించిన ఘనత అమరజీవి కామ్రేడ్ చింతల భూపాల్ రెడ్డికే దక్కుతుందని అన్నారు.

మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు మాట్లాడుతూ...

మునుగోడు డివిజన్ పార్టీ కార్యదర్శిగా, యాదాద్రి భువనగిరి జిల్లా పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యునిగా, పార్టీకి, ప్రజలకు అనేక ప్రజా పోరాటాలు నిర్వహించి సాధించిన వ్యక్తి కామ్రేడ్ చింతల భూపాల్ రెడ్డి అని కొనియాడారు. పార్టీ నిర్మాణ విస్తరణ కోసం విద్యార్థి, యువజన, మహిళా, కార్మిక, రైతు రంగాలను బలోపేతం చేశారని, ఆర్టీసీ డ్రైవర్‌గా జీవితాన్ని ప్రారంభించి ఒకపక్క ఉద్యోగం చేసుకుంటూనే మరోపక్క ఉద్యమాలు చేస్తూ పార్టీ విస్తరణ కోసం పూర్తికాలం కార్యకర్తగా పనిచేసిన నిస్వార్థమైన, నికార్సైన కమ్యూనిస్టు అని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు, జిల్లా కార్యదర్శి ఎండి జహంగీర్, కొండమడుగు నరసింహ, కల్లూరి మల్లేశం, బూరుగు కృష్ణారెడ్డి, ఎండి పాషా, శ్రీనివాస చారి, గంగాదేవి సైదులు, అవ్వారు రామేశ్వరి, రాగిరి కిష్టయ్య, సిర్పంగి స్వామి, బండారు నరసింహ, దండా అరుణ్ కుమార్, గడ్డం వెంకటేష్, గోపగోని లక్ష్మణ్, బత్తుల జయమ్మ దాసు, ఆకుల ధర్మయ్య, ఉస్కాబుల శ్రీనివాస్, ముత్యాలు, ఉష్కావుల రమేష్, బత్తుల శ్రీశైలం, అవ్వారి గోవర్ధన్, చింతల విప్లవ కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

ఇందిరమ్మ కుటుంబ జీవిత భీమా పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి




జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి
విశాల భారతి ఇబ్రహీంపట్నం

రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమం, కుటుంబాల ఆర్థిక భద్రతకు పెద్దపీట వేస్తూ ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెడుతున్న ఇందిరమ్మ కుటుంబ జీవిత భీమా పథకాన్ని జిల్లాలోని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి సూచించారు. ఈ నెల 19వ తేదీ గురువారం నాడు సిద్దిపేట జిల్లాలో గౌరవ రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు ఎనుముల రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ఇందిరమ్మ కుటుంబ జీవిత భీమా పథకాన్ని ప్రారంభిస్తారని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ పథకం ద్వారా ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా రక్షణ కల్పించడం ద్వారా కుటుంబాలకు ఆర్థిక భరోసా అందించాలన్నది రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఒక ప్రకటనలో తెలిపారు.కుటుంబంలోని సంపాదించే వ్యక్తి మరణిస్తే ఆ కుటుంబం ఆర్థిక ఇబ్బందులకు గురికాకుండా రూ.5 లక్షల జీవిత బీమా రక్షణ ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఆర్థిక భద్రత కల్పించడంతో పాటు, విపత్కర పరిస్థితుల్లో బాధిత కుటుంబాలకు అండగా నిలవాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేస్తోందని వివరించారు. 18 సంవత్సరాల నుంచి 59 సంవత్సరాల వయస్సు కలిగిన ప్రతి ఒక్కరూ అనగా (APL: Above poverty level, BPL: Below Poverty Level) ఇందిరమ్మ కుటుంబ జీవిత భీమా పథకానికి దరఖాస్తు చేసుకోవడానికి అర్హులని కలెక్టర్ తెలిపారు. ఈ పథకాన్ని అందరు సద్వినియోగపరుచుకోవాలని కలెక్టర్ సూచించారు. జిల్లాలోని అర్హులైన ప్రతి ఒక్కరికీ ఈ పథకంపై అవగాహన కల్పించేందుకు సంబంధిత గ్రామస్థాయి నుండి జిల్లాస్థాయి అధికారుల వరకు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ప్రజలకు ఈ పథకం ఉద్దేశాలు, ప్రయోజనాలు, అర్హత ప్రమాణాలపై విస్తృతంగా అవగాహన కల్పించాలని తెలిపారు.ప్రజలకు పథకంపై ఎలాంటి సందేహాలు ఉన్నా వాటిని నివృత్తి చేస్తూ, పథకం వివరాలు ప్రజలకు చేరేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం అమలు చేస్తున్న ఈ బృహత్తర పథకం ద్వారా అందించే రూ.5 లక్షల జీవిత బీమా రక్షణను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకొని తమ కుటుంబాలకు ఆర్థిక భద్రత కల్పించుకోవాలని జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి ఈ సందర్భంగా కోరారు.

రైల్వే అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

మల్కాజిగిరి :



హైదరాబాద్ రైల్వే డివిజన్ డివిజనల్ రైల్వే మేనేజర్ సంతోష్‌కుమార్ వర్మను ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి కలిశారు. గౌతంనగర్ ఆర్‌యూబీ, కొత్త బస్తీ డ్రైనేజీ లైన్ మంజూరు చేయడంపై రైల్వే అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. పలు సమస్యల పరిష్కారానికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో రైల్వే అధికారులు రామారావు, దుర్గాప్రసాద్, నేతలు మేకల రాము యాదవ్, జక్కుల కిరణ్ పాల్గొన్నారు.

చేయూత సభలో ప్రోటోకాల్ రగడ.. తోపులాట


- వేదికపై అనర్హుల కూర్చోవడంపై ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి అభ్యంతరం
- చంపాపేట్ మల్టీపర్పస్ ఫంక్షన్‌హాల్‌లో పింఛన్ పత్రాల పంపిణీ
- ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్ పట్నం మహేందర్‌రెడ్డి
- ప్రోటోకాల్ వివాదంతో ఇరువర్గాల మధ్య తోపులాట
- వేదికపైనే పడుకుని ఎమ్మెల్యే నిరసన



విశాల భారతి, ఎల్బీనగర్: ఎల్బీనగర్ నియోజకవర్గ పరిధిలోని చంపాపేట్ మల్టీపర్పస్ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన చేయూత పింఛన్ మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమం రాజకీయ వివాదానికి వేదికైంది. సభా వేదికపై ప్రోటోకాల్ పాటించకుండా కొందరు వ్యక్తులు కూర్చోవడంపై ఎల్బీనగర్ నియోజకవర్గం ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అభ్యంతరం వ్యక్తం చేయడంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం చోటుచేసుకుని చివరకు తోపులాటకు దారితీసింది. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ విప్ పట్నం మహేందర్‌రెడ్డి ముఖ్య అతిథిగా, ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో భాగంగా సభా వేదికపై ప్రోటోకాల్‌కు సంబంధం లేని వ్యక్తులు సైతం కూర్చోవడంపై ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి అభ్యంతరం వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య ఉద్రిక్తత నెలకొని తోపులాట జరిగింది. దీంతో తీవ్ర అసహనం వ్యక్తం చేసిన ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి వేదికపైనే పడుకుని నిరసన తెలిపారు. చేయూత పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ప్రోటోకాల్ వివాదం తలెత్తడం, ప్రజాప్రతినిధుల సమక్షంలోనే తోపులాట చోటుచేసుకోవడం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.

సర్పంచులకు సముచిత గౌరవం ఏదీ?

- చేయూత పింఛన్ల పంపిణీలో అధికారుల సమన్వయ లోపం
- పెద్దఅంబర్‌పేట తార కన్వెన్షన్‌లో పింఛన్ల పంపిణీ కార్యక్రమం
- ఇనాంగూడ సర్పంచ్‌కు కూర్చోవడానికి కుర్చీ కూడా కరువు
- మాజీ ప్రజాప్రతినిధులకు మాత్రం ముందువరుసలో స్థానం
- ప్రస్తుత సర్పంచులకు ప్రాధాన్యత కల్పించడంలో అధికారుల నిర్లక్ష్యంపై విమర్శలు



విశాల భారతి, అబ్దుల్లాపూర్‌మెట్ : ప్రభుత్వ కార్యక్రమాల్లో ప్రజలచే ఎన్నికైన ప్రస్తుత ప్రజాప్రతినిధులకు సముచిత గౌరవం, ప్రాధాన్యత కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉన్నప్పటికీ, అందుకు భిన్నంగా వ్యవహరించడం విమర్శలకు తావిస్తోంది. పెద్దఅంబర్‌పేట డివిజన్‌లోని తార కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించిన నూతన చేయూత పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో అధికారుల సమన్వయ లోపం స్పష్టంగా కనిపించిందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా ఇనాంగూడ గ్రామ సర్పంచ్‌కు కూర్చోవడానికి కనీసం కుర్చీ కూడా అందుబాటులో లేకపోవడంతో కార్యక్రమ వేదికపైనే నిలబడాల్సిన పరిస్థితి ఏర్పడినట్లు తెలుస్తోంది. మరోవైపు మాజీ ప్రజాప్రతినిధులకు మాత్రం ముందువరుసలో కూర్చునే అవకాశం కల్పించడం చర్చనీయాంశంగా మారింది. ప్రస్తుతం గ్రామ పాలన బాధ్యతలు నిర్వహిస్తున్న సర్పంచులకు తగిన గుర్తింపు, గౌరవం కల్పించకుండా మాజీ ప్రజాప్రతినిధులకు ప్రాధాన్యత ఇవ్వడంపై పలువురు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ కార్యక్రమాల్లో ప్రస్తుత సర్పంచులకు సముచిత స్థానం కల్పించలేకపోవడం అధికారుల పనితీరులో సమన్వయ లోపాన్ని ప్రతిబింబిస్తోందనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. గ్రామస్థాయిలో ప్రజలకు ప్రాతినిధ్యం వహిస్తున్న సర్పంచులను విస్మరించడం ఎంతవరకు సమంజసమని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఇకనైనా అధికారులు ప్రభుత్వ కార్యక్రమాల్లో ప్రోటోకాల్ నిబంధనలను పాటిస్తూ ప్రస్తుత సర్పంచులకు తగిన ప్రాధాన్యత, గౌరవం కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.

లంచం వసూళ్లలో సర్పంచ్ బాగోతం బట్టబయలు

- రూ.13 లక్షల లంచం డిమాండ్.. రూ.2 లక్షలతో ఏసీబీకి చిక్కిన సర్పంచ్
- తొలుత రూ.30 లక్షలు డిమాండ్.
- ఖమ్మంలో రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్న వరంగల్ ఏసీబీ

మహబూబాబాద్ జిల్లా విశాల భారతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్: అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) వలకు మరో ప్రజాప్రతినిధి చిక్కాడు. మహబూబాబాద్ జిల్లా సీరోలు మండలం మోదుగడ్డ తండా సర్పంచ్ ధరావత్ వీరు రూ.2 లక్షల లంచం తీసుకుంటూ వరంగల్ ఏసీబీ అధికారులకు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. ఏసీబీ వివరాల ప్రకారం.. శారద స్టోనెక్స్, ప్రీమియర్



అందుకే టాలీవుడ్‌కు దూరం

అచ్చ తెలుగందం శ్రీలీల గత కొంతకాలంగా తెలుగు సినిమాలను తగ్గించింది. దీంతో ఆమె టాలీవుడ్‌కు దూరమవుతున్నదా అని అభిమానుల్లో చర్చ మొదలైంది. తాజా ఇంటర్వ్యూలో ఈ ప్రశ్నకు సమాధానమిచ్చిందీ భామ. మెడిసిన్ చదువు, ఇంటర్న్‌షిప్ కారణంగా రెండేళ్ల పాటు ముంబయిలో ఉండాల్సి రావడంతో తెలుగులో కొత్త సినిమాలను అంగీకరించలేకపోయానని చెప్పింది. అంతకుమించి తెలుగుకు దూరం కావడానికి పెద్ద కారణాలు లేవని వివరించింది. సినిమాల జయాపజయాల గురించి మాట్లాడుతూ 'చాలా చిన్న వయసులో నటిగా ప్రయాణాన్ని మొదలుపెట్టాను. కెరీర్ తొలిరోజుల్లో సినిమాల ఎంపిక విషయంలో నాకు పెద్దగా స్వేచ్ఛ ఉండేది కాదు. తొలిరోజుల్లో వచ్చిన అవకాశాలను అంగీకరిస్తూ ముందుకెళ్లా. కొన్ని సినిమాల తర్వాత తప్పులు ఎక్కడ జరుగుతున్నాయో అర్థమైంది. ఇప్పుడు సినిమాల ఎంపికలో పరిణతి వచ్చింది' అని శ్రీలీల చెప్పింది.

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gangarapu Vijay. RNI No APTEL/2010/32877.